LA RÉPUBLIQUE
En Marche !

Lok Satta Party

రిపబ్లిక్ ఎన్ మార్చ్ -
లోక్‌సత్తా పార్టీ

₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 13
పక్షపత్రిక జూలై 1-15, 2017

# తీన్‌మార్

## డీమానిటైజేషన్ (పెద్దనోట్ల రద్దు)ను భారత్‌కు పరిష్కారంగా మార్చే కీలక సంస్కరణల దిశానిర్దేశం...

## జేపీ వ్యాస త్రయం

(నోట్ల రద్దును ప్రకటించిన తొలినాళ్లలో, ఏడు నెలల క్రితమే
కాలపరీక్షను తట్టుకునేలా జేపీ రాసిన మూడు వ్యాసాలు)

IS
DEMONETIZATION
THE
SOLUTION?









# ముఖ్యమంత్రీ! పౌర సేవల చట్టంపై ఎందుకాలస్యం ?

'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ/ఆర్‌టీఎస్) చట్టం కోసం లోక్‌సత్తా పోస్టు కార్డుల ఉద్యమం కొనసాగుతోంది. బంగారు తెలంగాణను సాధించాలంటే... ప్రజలందరికీ ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా రోజువారీ పనులు చేసిపెట్టే పౌర సేవల చట్టాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే తీసుకురావాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ అనుబంధ విద్యార్థిసత్తా నేతలు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు పోస్టుకార్డులు రాశారు. లోక్‌సత్తా 1998 నుంచి ఈ చట్టం కోసం కృషి చేస్తున్నందున, పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు ఇప్పటికే జాతీయస్థాయి బిల్లును తయారుచేసినందున వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే ప్రభుత్వానికి ఆర్‌టీఎస్ ముసాయిదాను పంపారని, దీనిపై చర్చించి వేగంగా చట్టాన్ని తేవాలని కోరారు. విద్యార్థిసత్తా రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్, ఉపాధ్యక్షుడు ప్రద్యుమ్న, కార్యదర్శి రమాకాంత్, లోక్‌సత్తా పార్టీ మహేశ్వరం ఇంచార్జి టి.ప్రసాద్, మనోహర్, ఇజాజ్, విజయ, శ్రీనివాస్, వరుణ్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

సూర్యాపేటలో లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ పోస్టుకార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్డులు రాయటంతోపాటు పౌర సేవల చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కూడా కృషి చేస్తున్నామన్నారు. ఆర్‌టీఎస్ చట్టం వస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు లేకుండా నిర్దిష్ట గడువులోగా పనులు జరుగుతాయని, పని జరక్కపోతే ప్రభుత్వమే ప్రజలకు పరిహారం చెల్లించాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సైదులు, భరత్, కింగ్, శ్రీను, ఏసు తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూలై 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 13

## లోపలి పేజీల్లో...

పెద్ద నోట్ల రద్దు- పెద్దమార్పుకి ............ 5

'ఒకే దేశం-ఒకే ఎన్నిక-సురాజ్యం' కోసం. 11

కేంద్రీకృత దుష్పరిపాలన? ఇకనైనా....... 14

'దామాషా పద్ధతి' .......................... 16

నీతి ఆయోగ్ పదిహేనేళ్ల వ్యూహం......... 17

మోదీ కేబినెట్‌లో స్థాయిలేని మంత్రులు.. 21

గ్రేట్ ఇండియన్ బ్యాంక్ రాబరీ- రికవరీ.. 22

ఇక జీఎస్టీ జమానా- సెప్టెంబర్ నుంచి.....24

కరీంనగర్ ఉద్యమాల చుక్కాని .......... 27

పరిశ్రమల పేరుతో రియల్‌ఎస్టేట్ ..........28

విశాఖ భూకుంభకోణంపై సీబీఐ.......... 29

ఉత్తరాంధ్ర ఏం కోరుతున్నది?............. 31

రిపబ్లిక్ ఎన్ మార్చ్-లోక్‌సత్తా పార్టీ....... 34

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం


బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# జేపీ పరిష్కారాలు చదివే ముందు..

నరేంద్ర మోదీ ప్రధాని కాకముందు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆయనతో ఒకసారి సమావేశమయ్యారు. లక్ష్యం కోసం వ్యక్తిగత సుఖాలను పక్కనపెట్టి రుషిలా పనిచేయటం గురించి కొంతైనా తెలిసినవాడు కాబట్టి.. జేపీ సుదీర్ఘ ప్రజాస్వామ్య సంస్కరణోద్యమ కృషి విలువను గుర్తించి ఎంతో గౌరవపూర్వకంగా మోదీ ఆహ్వానించారు. తనతో సమానంగా ఉండేలా కుర్చీ వేసి గౌరవించారు. ఆ సందర్భంగా దేశానికి కావలసిన కీలక సంస్కరణల గురించి జేపీ ప్రస్తావించారు. యువతకు ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని అధికారాల వికేంద్రీకరణ, రైతుకు ఆదాయం, సహకార వ్యవస్థ, సంపదసృష్టి తదితర అంశాలను వివరించారు. విద్య గురించి మాట్లాడుతున్నప్పుడు 'పిల్లల యూనివర్సిటీ' పెట్టాలని ఉన్నట్టు మోదీ తన మనసులోని కోరికను చెప్పారు. దేశానికి ఏదో చేయాలి, భావితరాలకు మంచి సమాజాన్నివ్వాలి, తన పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోవాలి వంటి ఆలోచనలు ఉద్వేగభరితంగా, నిజాయతీగా, బలంగా ఉన్నా.. వాటిని సాధించటానికి కావలసిన స్పష్టత మోదీ వద్ద లేదని జేపీ అర్థం చేసుకున్నారు. ఈ లోపాన్ని పూరిస్తే.. తాయిలాలు, ప్రజల మధ్య చిచ్చు పెట్టే ధోరణులకు దూరంగా ఉండటంతోపాటు రాష్ట్రస్థాయి పాలనానుభవం, దేశ ప్రజల ఆదరణ చూరగొనే సామర్థ్యం పుష్కలంగా ఉన్న మోదీ ద్వారా దేశానికి మేలు చేసే అవకాశముందని భావించారు. అందుకే 2014 ఎన్నికల్లో మోదీకి మద్దతిస్తూ లోక్‌సత్తా ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు జేపీ ప్రయత్నించారు. అయితే ఊహించినదానికంటే మెరుగైన మెజారిటీ రావటంతోనేమో మోదీ తన కొత్త ఆలోచనలను కిందికి తోసి పాత గుజరాత్‌లోలా పాలన, పార్టీ రాజకీయం చేయసాగారు. కొంతమంది నమ్మినబంట్లులాంటి ఉన్నతాధికారులను చుట్టూ పెట్టుకుని ప్రధానమంత్రి కార్యాలయంలో అధికారాన్ని కేంద్రీకరించి నిర్ణయాలు చేయసాగారు. ఎన్నికైన తొలినాళ్ల నుంచే మోదీ సంస్కరణల్ని అమలుచేయటానికి వీలుగా చేపట్టాల్సిన.. రాజ్యసభ అధికారాల సవరణ, రాష్ట్రాలకు జవాబుదారీ తనమున్న స్వయంప్రతిపత్తితో కాశ్మీర్ ఫార్ములా, అవినీతి నిరోధానికి ఎన్నికల సంస్కరణలు, పౌరసేవల చట్టం, స్వచ్ఛభారత్ విజయానికి స్థానిక ప్రభుత్వాల సాధికారత, విద్య, ఆరోగ్యం, నల్లధనం, వ్యవసాయ, పోలీసు, న్యాయసంస్కరణలు వంటి పలు అంశాలను జేపీ ఎప్పటికప్పుడు తెలియచేస్తున్నా అరకొరగా తీసుకోవటమే తప్ప పూర్తిస్థాయిలో వాటికి ప్రాధాన్యత ఇచ్చేందుకు మోదీ ప్రయత్నించలేదు. ప్రతిపక్షాల దివాలా కోరుతనం వల్ల.. అధికార నిషాని ఆస్వాదించటానికి మోదీకి, ఆయన బృందానికి ఆటంకం లేకుండా పోయింది. ఇలాంటి సమయంలోనే పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)ను నవంబర్ 8, 2016న ప్రధాని ప్రకటించారు. నల్లధనం నిరోధానికి ఈ చర్య చేపడుతున్నట్టు ఆరోజు ఆయన చెప్పారు. కొన్ని ఎన్నికల ప్రయోజనాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వల్ల విదేశీ పెట్టుబడులు పెరుగుతాయన్న భావన కూడా ఆయన మనసులో ఉండి ఉండొచ్చు. నోట్ల రద్దు ప్రకటన టీవీలో వస్తున్నప్పుడే జేపీ దానికి మద్దతు ప్రకటించారు. కానీ అది కేవలం ఒక భారీ సంక్లిష్ట అడుగు మాత్రమేనని స్పష్టంచేశారు. దాని ద్వారా ఆశిస్తున్న నల్లధనం నియంత్రణ, అవినీతి అంతం వంటివి నెరవేరాలంటే పౌరసేవల హక్కు చట్టం, పన్నుల వ్యవస్థ ప్రక్షాళన నుంచి రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాల సాధికారత వరకూ పలు సంస్కరణల్ని తీసుకురావాలని జేపీ ప్రధానికి తెలిపారు. కానీ అంత పెద్ద చర్య తీసుకుంటున్నప్పుడు.. 90శాతానికిపైగా ప్రజలు అసంఘటితరంగంలో ఉన్న దేశంలో నగదు నిల్వ దగ్గర్నుంచి చేయాల్సిన కనీస ఏర్పాట్ల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైంది. మనదేశ పాలనా యంత్రాంగం ఎంత అధ్వాన్నంగా ఉందో కరెన్సీ కట్టల మార్పిడి, నకిలీ నోట్లు బ్యాంకుల్లో చేరిన తీరు, సామాన్య ప్రజలు ఎదుర్కొన్న అంతులేని కష్టాలు అద్దం పట్టాయి. రూ.500, 1000 నోట్లతో ఎంత డబ్బు తిరిగి వచ్చిందో చెప్పటానికి కూడా రిజర్వుబ్యాంకు సిగ్గుపడే పరిస్థితి ఏర్పడింది. ఈ వైఫల్యాలన్నిటినీ ఎండగడుతూనే, డీమానిటైజేషన్‌ని భారత్‌కు ఒక పరిష్కారంగా మార్చే సంస్కరణలను మూడు వ్యాసాల రూపంలో డిసెంబర్ 2016లో జేపీ ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, పౌరసమాజం ముందుంచారు. మొదటివ్యాసంలో పేర్కొన్న సంస్కరణల్ని మిగిలిన రెండు వ్యాసాలు విశదీకరిస్తాయి. డీమానిటైజేషన్‌పై ఎవరి అంచనాలు ఎలా తల్లకిందులైనా.. అంకెలు కాస్త అటూఇటూ అయివుండొచ్చుగానీ, ఈ వ్యాసాలలోని అంశాలలో ఏమార్పూ చేయాల్సి రాలేదు. దాదాపు ఏడు నెలల క్రితం జేపీ రాసిన వ్యాస త్రయాన్ని ఈ సంచికలో లోక్‌సత్తా టైమ్స్ పాఠకులకు అందిస్తున్నాం. డీమానిటైజేషన్ వల్ల కరెన్సీ కొరత, లావాదేవీల్లో అపనమ్మకం పెరిగి పంట ధరల విషయంలో రైతులు ఈ సంవత్సరం భారీగా నష్టపోయారని వార్తలు సూచిస్తున్నాయి. ఇందులో కొంత వాస్తవమున్నప్పటికీ, నోట్ల రద్దు వల్లే వ్యవసాయ సంక్షోభం రాలేదు. ధరంటూ ఉంటే డిజిటల్ లావాదేవీలు చేసుకోవటానికి అవకాశాలు అందుబాటులోనే ఉన్నాయి. డీమానిటైజేషన్ రైతుల తక్షణ సంక్షోభానికి దారితీసింది కాబట్టి.. 2019 ఎన్నికల్లో వ్యవసాయ రుణాల మాఫీకి దాదాపు అన్ని రాష్ట్రాల్లో హామీ ఇస్తారని, దీనివల్ల దాదాపు రూ.3 లక్షల కోట్లు (జీడీపీలో 2.6శాతం) దేశం నష్టపోవాల్సి వస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి. అంటే, అత్యంత ప్రజాదరణ పొందిన మోదీ కంటే రెయిన్‌కోట్ వేసుకుని స్నానం చేసినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగే మెరుగ్గా లెక్కలు వేయగలిగారన్నమాట. ఇలా రుణమాఫీయే జరిగితే సొమ్ము పోయే శనీ పట్టే తరహాలో డీమానిటైజేషన్‌తో రూ.3-4లక్షల కోట్ల నష్టాన్ని తెచ్చిన ఘనత మోదీకి చుట్టుకుంటుంది. ఆ తర్వాత రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా పరపతి సమస్యలు తలెత్తుతాయి. ప్రధాని సరైన బృందాన్ని ఏర్పరచుకోకపోతే దేశానికి జరిగే నష్టం ఎంత భారీగానైనా ఉండొచ్చు! మాలిన్యాలను తొలగించటానికే శని కష్టాలు పెడతాడని, మాలిన్యం లేనివారికి దోచిపెడతాడని నమ్మిక. జేపీ వ్యాసత్రయంలో చెప్పిన పరిష్కారాలతోపాటు వ్యవసాయాన్ని బాగు చేసి రైతు ఆదాయం చుట్టూ నిర్మించటానికి కూడా మోదీ ప్రభుత్వం వేగంగా చర్యలు ప్రారంభించాలి. ఈ విధానాలను కూడా లోక్‌సత్తా ఇప్పటికే ప్రభుత్వం ముందుంచింది. లోక్‌సత్తా కృషి వల్లే 2011-12లో కేంద్రం ఎగుమతులను పునరుద్ధరించింది, ఆహారధాన్యాల ఎగుమతుల్లో అగ్రస్థానంతో భారత్ భారీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది. ఎమర్జెన్సీకి ముందు, ఎమర్జెన్సీ తర్వాత అన్నట్టుగా.. డీమానిటైజేషన్‌కు ముందు, డీమానిటైజేషన్ తర్వాత అనే స్థాయి ప్రభావాన్ని నోట్ల రద్దు భారత్ మీద చూపింది. డీమానిటైజేషన్‌ను ఒక అవకాశంగా మలచుకుని ఈ సంస్కరణల్ని తేవటం మీదే దేశ భవిష్యత్తు స్థాయి ఆధారపడి ఉంటుంది.

- ఎడిటోరియల్ టీం ◈




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. **10** ,
ఏడాది చందా : రు. **200**
మూడేళ్ళ చందా : రు. **500**


చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

చెలామణిలో వున్న పెద్ద నోట్లలో లెక్కచూపని డబ్బు ఎంత ఉందో కచ్చితంగా అంచనా వేయటం అసాధ్యం. రూ. 14లక్షల కోట్లకు పైగా పెద్దనోట్లు ఉంటాయని తర్కబద్ధంగా అనుకోవచ్చు. ఈ డబ్బు మూడు రూపాలలో ఉంది. మొదటిది– సుమారు రూ. 4లక్షల కోట్ల మేర నగదు రిజర్వు నిష్పత్తిగా బ్యాంకుల్లో నిల్వ ఉంది. మొత్తం బ్యాంకు డిపాజిట్లలో చట్ట ప్రకారం ఉండే 4శాతమన్నమాట ఇది. మిగతాదాంట్లో ఎక్కువభాగం వ్యవసాయం, చిన్న వ్యాపారాల్లో 90శాతం అసంఘటితంగా ఉపాధి పొందేవారు, రెక్కల కష్టంతో బతికేవారి వద్ద, రోజువారీ ఇంటి అవసరాలకు, వ్యాపార లావాదేవీల కోసం అట్టిపెట్టుకునే డబ్బు రూపంలోనూ ఉంది. ఇవన్నీ పోగా మిగిలినడబ్బే– బహుశా 30–40శాతం – 'లెక్కలుచూపని డబ్బు'గా ఉంది.




# పెద్ద నోట్ల రద్దు - 'పెద్ద మార్పు'కి వెలకట్టలేని అవకాశం!

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

కానీ ఈ డబ్బంతా అనైతికమైనది కాదు, అవినీతితో కూడగట్టిన నల్లధనమూ కాదు. ఈ లెక్కలు చూపని డబ్బులో ఎక్కువభాగం స్థిరాస్తి రంగంలో నగదు లావాదేవీల వల్ల పేరుకుపోయిందే. చట్టబద్ధంగా, ఆదాయం లెక్కచూపుతూ నిజాయతీగా బతికే మధ్యతరగతి భారతీయుడు/భారతీయురాలు తన లెక్కచూపిన డబ్బును కూడా ఒక చిన్న స్థలం లేదా ఫ్లాట్ కోసం నగదుగా మార్చాల్సి వస్తోంది. స్థిరాస్తి లావాదేవీల్లో అత్యధికం 50శాతం, ఆపైన కూడా నగదు రూపంలో ఉంటాయన్నది బహిరంగ రహస్యం. నగదు రూపంలో చెల్లింపులు చేయను అనే వారు మార్కెట్‌లో నష్టపోవాల్సి ఉంటుంది. కోరుకున్న ఇళ్లు, స్థలాలు కొనుక్కోలేరు, అమ్మాలనుకున్నవి అమ్మలేరు. ఎందుకంటే, కొనేవాళ్లు మొత్తం చెల్లింపును చెక్కు ద్వారా చేయరు, అమ్మేవారు మొత్తం డబ్బును చెక్కు ద్వారా తీసుకోవటానికి ఇష్టపడరు. దీనికితోడు, జీవితకాలంలో ఎప్పుడోకసారి చేసే ఈ భారీలావాదేవీల సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ సమయంలో ఆనవాయితీ అవినీతి! అదనంగా భారీ స్టాంప్ రుసుములతో (కొనుగోలుదారునికి), క్యాపిటల్ గెయిన్స్ పన్ను (అమ్మకందారునికి) బాదుడు.

మిగిలిన డబ్బు– బహుశా 20శాతం వరకూ ఉండొచ్చు– అప్రకటిత ఆదాయంపై ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టిన పన్ను, అవినీతి నుంచి పోగుపడి వుండవచ్చు.

కాబట్టి.. మొత్తం నగదు అంతటినీ అనైతికం, పన్నులు కట్టనిది, అవినీతితో సంపాదించినదిగా భావించటం ద్వారా మనం నగదు ఆర్థిక వ్యవస్థను తగ్గించలేం, చట్టప్రకారం పన్నులు కట్టేందుకు స్వచ్ఛందంగా ప్రజల్ని సంసిద్ధుల్ని చేయలేం.

చెలామణిలో వున్న పెద్దనోట్లలో రూ. 2.5 లక్షలు – 3లక్షల కోట్లు మాత్రమే వెల్లడించని ఆదాయం లేదా అవినీతిగా భావించటం సహేతుకమవుతుంది. విదేశీ ఎకౌంట్లు, స్థిరాస్తి, ఆభరణాలు వంటి ఇతర ఆస్తుల రూపంలో దాచిన వాస్తవంగా లెక్కచూపని సంపదలో ఇది 3 – 5శాతం మాత్రమే ఉంటుందని పలువురు ఆర్థికవేత్తల విశ్వాసం. జీడీపీలో 20–25శాతాన్ని వెల్లడించని ఆస్తిగా మారుస్తూ ఏటా రూ. 25–30 లక్షల కోట్లను పోగేస్తున్నారని కొంతమంది అంచనా. ఈ మొత్తాన్ని దాచిపెట్టరుగానీ, ఇందులో చాలామేర తెలుపుగానే చేసే ఖర్చుతో విలాస వస్తువులు వంటివి కొంటూ ఆర్థిక లావాదేవీల్ని నీటబొట్లలా కిందిస్థాయికి పంపిణీ చేస్తుంటారు.

కాబట్టి డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు).. నగదు రూపంలో పెద్దఎత్తున వున్న నల్లధనాన్ని వెలికితీయలేదు, నిర్మూలించలేదు. మహాఅయితే, ఇది కరెన్సీని ఒకతూరి బ్యాంకు డిపాజిట్ల రూపంలోకి మార్చగలదు. నగదురహిత (నాన్–క్యాష్) ఆర్థిక వ్యవస్థ దిశగా ఇది

అవసరమైన తొలి అడుగు. ఇతర అవసరమైన చర్యల్ని, అంటే – పన్నులు చెల్లించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సిద్ధపడటం, లెక్కలుచూపని నల్లధనం ఇక ముందు తలెత్తకుండా చేయడం కోసం – కూడా వెంటవెంటనే తీసుకుంటే ఇది మన ఆర్థిక వ్యవస్థని, సమాజాన్ని సమూలంగా మార్చగలుగుతుంది.

ఇంత భారీ కార్యక్రమాన్ని అమలుచేసే క్రమంలో తలెత్తే సమస్యలని అంచనావేయటంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని విస్పష్టంగానే కనిపిస్తోంది. పాత నోట్లను మార్చుకుని కొత్తవి తీసుకోవటానికి తగినంత కొత్త కరెన్సీ సకాలంలో సిద్ధం కాలేదు. కొరత, రేషనింగ్, అరాచకాలకు ఇది దారితీసింది. కొత్త కరెన్సీ నోట్లు సైజులో భిన్నంగా ఉండటంతో ఏటీఎంలలో క్యాలిబరేషన్ కష్టమైంది. ముందుగా ప్రణాళిక లేకపోవటం వల్ల దాదాపు రోజుకో నిబంధన, మార్గదర్శకం విడుదల చేయాల్సి వచ్చింది. ఇవన్నీ నివారించదగ్గ పాలనా తప్పిదాలు. వీటి వల్ల సామాన్య ప్రజలకు, ముఖ్యంగా అసంఘటిత రంగంలో పెద్దఎత్తున ఉపాధి పొందుతున్నవారికి, రైతులు, చిన్న వ్యాపారులకు పెద్ద కష్టం వచ్చింది.

ప్రత్యక్షంగా అనుభవిస్తున్న, కనిపిస్తున్న ఈ తక్షణ బాధకు అర్థం ఉండాలంటే.. నల్లధనం, అవినీతి, ఓట్ల కొనుగోలు అనే కంటకాల్ని అంతం చేసేందుకు అవసరమైన ఇతర చర్యల్ని కూడా వేగంగా తీసుకోవాలి, మనం పన్నులు చెల్లించేది మన మేలు కోసమే అన్న భావన పౌరుల్లో కలిగించాలి. పన్నుల శాఖ అధికారులకు మితిమీరిన పెత్తనం ఇచ్చి ఇష్టమొచ్చిన తనిఖీలకు అవకాశం ఇవ్వడం, లైసెన్స్–పర్మిట్ వ్యవస్థ ఇష్టారాజ్యం వల్ల నల్లధనం,




అవినీతి పెరిగిపోయాయి. మన ఆర్థికరంగం మొదటి దశలో జరిగిందిదే. కాబట్టి ఈ పద్ధతుల మీదే ఇంకా ఆధారపడటం వినాశాన్ని కొనసాగించటమే అవుతుంది.

మరి పన్నుల చట్టాలు, ప్రభుత్వాధికారుల ప్రవర్తన, ప్రభుత్వాల చర్యల పట్ల ప్రజల దృక్పథాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి ఎటువంటి ఆచరణాత్మకమైన, హేతుబద్ధమైన, ప్రభావం చూపగల చర్యల్ని తీసుకోవాలి?

ఇందుకోసం డీమానిటైజేషన్ భారీ కార్యక్రమంతోపాటు ఐదు ఆచరణాత్మకమైన చర్యల్ని చేపట్టాలి. ఇవి దాదాపు ప్రతి పౌరుని జీవితాన్ని స్పృశిస్తూ మార్పు దిశగా ప్రభావితం చేయగలిగినవి.

### హక్కుగా పౌరసేవలు (సర్వీస్ డెలివరీ)

1. తగిన సేవలు అందించకుండా పన్నులు విధించటమంటే చట్టబద్ధంగా దోపిడీ చేయటమే! మన పన్ను రేట్లు ఎక్కువ పన్ను ఉన్న దేశాల్లోలాగే 30శాతంగా ఉన్నాయి. కానీ అంత పన్ను కట్టినందుకు బదులుగా ప్రజలకు అందించాల్సిన సేవలు మాత్రం అధ్వాన్నంగా ఉన్నాయి. మన మౌలికవసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, విద్య, ఆరోగ్యం అన్నీ నాగరిక ప్రపంచ ప్రమాణాలకు ఏమాత్రం సరితూగవు. విశ్వసనీయతలేనివి, నాసిరకమైనవి! వీటన్నిటినీ మించి ప్రతి చిన్న పనికీ .. హక్కుగా అందాల్సిన ప్రతి ప్రభుత్వ సేవకీ కూడా ప్రజలు లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లంచం ఇవ్వకపోతే ఆలస్యాలు, మళ్లీ మళ్లీ తిరగటాలు, వేధింపులు, అవమానాలు, తిరస్కారాలు ఎదుర్కోవాలి. చాలా సందర్భాల్లో, రేషన్ కార్డు, జనన ధ్రువపత్రం, ఆదాయ లేదా కుల ధ్రువపత్రం, భూముల రికార్డులు, సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్, నీటి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ వంటివి లంచం ఇవ్వకుండా రావు.

ప్రతి ప్రభుత్వ సేవకీ నిర్ణీత గడువుని పెట్టి, అది దాటాక ఆలస్యం జరిగితే రోజుకు కొంత డబ్బుని పరిహారం కింద దరఖాస్తుదారులైన ప్రజానీకానికి హక్కుగా అందించే పౌరసేవల (పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ) చట్టాన్ని గనక వెంటనే అమలుచేస్తే.. తాము కట్టిన పన్నులకు తగ్గ సేవలు అందుతున్నాయని పౌరుల్లో సంతృప్తి పెరిగి, స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తారు. ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య పరస్పర విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలను సక్రమంగా అందించకపోవడం వల్ల

ఎక్కువగా నష్టపోతున్నది పేద, మధ్యతరగతి వారే కాబట్టి, హక్కుగా పౌరసేవల చట్టం వల్ల అదనపు ఖర్చు లేకుండానే ఈదేశంలోని అత్యధిక శాతం ప్రజలకు రోజువారీ బలవంతపు లంచాల భారం లేకుండా చేయవచ్చు. వారి జీవితాల్ని మెరుగుపరచవచ్చు.

**పన్ను రేట్లు**

2. ప్రభుత్వం అందిస్తున్న అధ్వాన్న స్థాయి మౌలిక సేవలతో పోలిస్తే మన పన్ను రేట్లు ఎక్కువనే చెప్పాలి. ఇప్పుడు లెక్కలు చూపని డబ్బు బ్యాంకులకు చేరుతోంది, పన్నుల రాబడి పెరుగుతుంది కాబట్టి ప్రభుత్వం ఆదాయం తగ్గకుండానే నిక్షేపంగా పన్నుల రేట్లను తగ్గించవచ్చు. సేవలు లేకుండా పన్నులు విధించటం ప్రజాస్వామిక సమాజంలో సహించరానిది. ఇది తొందరలోనే చట్టబద్ధ దోపిడీ, బలవంతపు వసూళ్ల కార్యక్రమం స్థాయికి దిగజారిపోతుంది. పన్నుల్ని, జీడీపీ నిష్పత్తిని పెంచటానికి, ప్రజలు తమంతటతాము పన్నుల్ని చెల్లించటానికి అత్యుత్తమ మార్గం- పన్నులకు, సేవలకు మధ్య సంబంధాన్ని పునరుద్ధరించటం.

పౌరులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించటానికి మూడు చర్యలు కీలకం.

ఎ) ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా ఆదాయపు పన్నుని తక్షణం తగ్గించటం. ఉదాహరణకి 5శాతం మేర తగ్గింపు.

బి) నిష్పాక్షికంగా పన్నుల మదింపు చేసి విచక్షణ చూపే ప్రత్యేక అధికారం లేకుండా అందరికీ సమానంగా పన్ను చట్టాల్ని వర్తింప చేయటం ద్వారా పన్ను అధికారుల వేధింపులు, అవినీతి ఇక ముందు లేకుండా చేయాలి.

సి) స్థానిక ప్రభుత్వాలకు వనరుల్ని బదిలీ చేయాలి. తమ డబ్బు ఎటుపోతోందో అర్థం చేసుకునే పౌరులు ఉండే పట్టణ ప్రాంతాలలో ఈ పని వెంటనే చేయాలి. దీనికితోడు, నాణ్యమైన సేవలు, పన్ను డబ్బు దుర్వినియోగం చేయకుండా జవాబుదారీతనం కోసం (అంబుడ్స్‌మన్) వ్యవస్థల్ని ఏర్పాటు చేసి స్థానికంగా పన్నుల పెంపును ప్రోత్సహించాలి.

**రియల్ ఎస్టేట్ సంస్కరణ**

3. రియల్ ఎస్టేట్ రంగంలో సంస్కరణ ఎంతో కాలంగా వాయిదా పడుతూ వస్తోంది. నిజాయతీపరులైన రైతులు, జీతాల మీద ఆధారపడిన మధ్యతరగతివారు అనేకమంది తమకు ఎటువంటి లాభం లేకపోయినా బలవంతంగా నగదు లావాదేవీలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మూడు సాధారణ చర్యలు తీసుకుంటే, ఆదాయం తగ్గకుండానే స్థిరాస్తి రంగంలో నల్లధనాన్ని నిర్మూలించవచ్చు.

ఎ) ప్రస్తుత మార్కెట్ ధరలో 75-80శాతానికి తగ్గకుండా భూమి మూల విలువను పెంచాలి.

బి) ఆదాయం తగ్గకుండా రెవెన్యూ స్టాంప్ డ్యూటీని తగ్గించాలి. దీనివల్ల కొనేవారు అసలు ధరనే చూపించి పూర్తి పన్నుల్ని చెల్లిస్తారు, ప్రభుత్వం ఆదాయాన్ని నష్టపోదు.

సి) క్యాపిటల్ గెయిన్స్ పన్నుని 20శాతం నుంచి 10శాతానికి తగ్గించాలి. రిజిస్టర్ అయిన అమ్మకం ధర మార్కెట్ ధరకి దాదాపు సమానంగానే ఉంటుంది కాబట్టి ప్రభుత్వానికి ఆదాయమేమీ తగ్గదు. దీర్ఘకాల క్యాపిటల్ గెయిన్స్ మీద స్టాక్ మార్కెట్‌లో పన్నులు లేనప్పుడు, పట్టణ ప్రాంత ఇళ్ల మీద 20శాతం పన్ను విధించటంలో అర్థం లేదు. అందులోనూ.. మార్పిడి మరింత ఖరీదవటం, భూమి విలువలు పెరుగుతూండటం, చాలామంది ప్రజలు తమ జీవితకాలం దాచుకున్న సొమ్మును ఇల్లురూపంలోనో, పట్టణప్రాంతంలో మరో ఆస్తిరూపంలోనో దాచుకోవటం వంటి అంశాలు ఇందులో ఇమిడివున్నాయి.

**లాలూచీ అవినీతి**


ఒక్కసారి పౌరసేవల గ్యారంటీలతో చిన్నస్థాయి అవినీతిని తగ్గించి, స్థానికానికి పరిమితం చేశాక.. అధికారానికి జవాబుదారీతనాన్ని జోడించటం, లాలూచీతో చేసే భారీ అవినీతిని నిరోధించటం సమస్యలుగా మిగిలివుంటాయి. భారీ అవినీతిలో, లంచం ఇచ్చేవారు, లంచం పుచ్చుకునేవారు ఇద్దరూ ప్రజలను మోసం చేస్తూ పోటీని తగ్గించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తుంటారు. ప్రకృతి వనరుల్ని దోచుకుంటూ ప్రజా ప్రయోజనాల్ని, ప్రజలకు అందాల్సిన సేవల్ని కొల్లగొడుతూ పర్యావరణానికి కూడా హానిచేస్తుంటారు. ఈ లాలూచీ అవినీతిని వేగంగా, కఠినంగా నిర్మూలించకపోతే, ఇది నగదు నుంచి స్థిర, ఇతర ఆస్తులుగా, విదేశీ ఎకౌంట్లలో డిపాజిట్లుగా మారిపోయి అవినీతికి రాచమార్గమవుతుంది. ఈ భారీ, లాలూచీ అవినీతిని నిరోధించడానికి మూడు ఆచరణాత్మకమైన చర్యలు అవసరం.

ఎ) అవినీతి నిరోధక చట్టంలో ప్రతిపాదించిన మతిలేని సవరణల్ని ఉపసంహరించుకోవాలి. తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం గతిలేక బలవంతంగా లంచాలిచ్చే సామాన్య పౌరులకు కూడా 3 ఏళ్ల జైలు శిక్షను ఈ సవరణల్లో తప్పనిసరి చేశారు. మరోవైపు, లంచం తీసుకునేవారిపై పై నుంచి కిందిస్థాయి వరకు కనీసం పోలీసు దర్యాప్తు చేయాలన్నా ముందస్తు అనుమతి

కావాలన్నారు. బాధిత ప్రజలకు శిక్ష, లంచగొండులకు రక్ష అన్న ఈ సవరణల్ని తొలగించి.. హక్కుగా అందాల్సిన సేవలకు బలవంతంగా లంచం ఇచ్చే పౌరులకు పూర్తి రక్షణ ఇవ్వాలి. ఉద్దేశపూర్వకంగా చేసే దర్యాప్తులకు అవకాశం లేకుండా ప్రభుత్వ స్థాయిలో విధానపరమైన అంశాల్లో మాత్రమే ప్రభుత్వోద్యోగులకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ విధానాలకనుగుణంగా సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలలో ఉద్యోగులను ఇరికించకూడదు.

బి) తీవ్ర అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారుల్లో కనీసం ఓ 1000మందికి తప్పనిసరి రిటైర్‌మెంట్ ఇచ్చి ఇంటికి పంపించాలి. వ్యవస్థలోని రాజకీయ నాయకులు, అధికారులు, మీడియా, వాణిజ్యవేత్తలు అందరికీ తెలుసు ఎవరు అవినీతిపరులో! కానీ మౌనం వహిస్తుంటారు. 50 ఏళ్ల వయసు లేదా 25 ఏళ్ల సర్వీసు అనంతరం ఎటువంటి కారణం లేకుండా వారి చేత పదవీవిరమణ చేయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ చర్య సరైన, బలమైన సంకేతం ఇవ్వాలంటే.. దేశానికి నష్టం చేసిన అత్యంత అవినీతిపరుల్ని ఎటువంటి భయం, పక్షపాతం, ద్వేషం లేకుండా ప్రభుత్వం గుర్తించాలి. తన నిర్ణయాల్లో పూర్తి న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా ఉండాలి. లేకుంటే, దీనివల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతుంది.

సి) స్మగ్లింగ్, విదేశీ మారక ద్రవ్య అక్రమాలకు పాల్పడేవారిని కట్టడి చేయడానికి 1976లో రూపొందించిన 'సఫెమ' (ఎస్ఎఫ్ఈఎంఏ) తరహాలో అవినీతిని నిరోధించడానికి చట్టం తీసుకురావాలి. 1988లో సుప్రీంకోర్టు కూడా ఇదే మాట చెప్పింది. అవినీతిని




అంతం చేయడానికి ఇటువంటి చట్టం అవసరమని అత్యున్నత న్యాయస్థానం విస్పష్టంగా సూచించింది. ఈ చట్టంలో మూడు కీలక ఏర్పాట్లు ఉండాలి– బినామీ ఆస్తులు సహా మొత్తం ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం, 15 ఏళ్లు లేదా ఇంకా ఎక్కువ జైలు తప్పనిసరి చేయడం, ప్రాథమిక సాక్ష్యం ఉంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను నిందితుని మీదకే మళ్లించటం.

5. ఓట్ల కొనుగోలును నిర్మూలించేందుకు వ్యవస్థీకృత రాజకీయ సంస్కరణ

పైన పేర్కొన్న ఈ చర్యలన్నీ నల్లధనాన్ని, అవినీతిని కట్టడి చేయటానికి ఎంతో దోహదం చేస్తాయి. కానీ ఓట్లు కొనుగోలును, ఎన్నికలలో విపరీతంగా ఖర్చు పెడుతున్న అక్రమ సొమ్మును కట్టడి చేయకుంటే, అవి నిలబడవు.

జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ఐదేళ్ల ఎన్నికల కాలవ్యవధిలో దాదాపు రూ.1,00,000కోట్లు (ఒక ట్రిలియన్) అక్రమంగా ఖర్చు చేస్తారని అంచనా. ఇటువంటి వ్యవస్థను కొనసాగించటానికి గాను, తాము చేసిన ఖర్చుకు పదిరెట్లు అక్రమంగా ఎన్నికైనవారు ఆర్జించు కుంటారు. అంటే, రాజకీయ అవినీతి రూ. 10,00,000 కోట్లు (పది ట్రిలియన్లు) దాకా ఉంటుంది. ఎన్నికల మధ్య కాలంలో నియోజకవర్గంలో పార్టీ యంత్రాంగాన్ని పోషించటానికి, పార్టీ నేతల విలాసాలకు, తమ జీవితాన్ని రాజకీయ కార్యకలాపాలకు అంకితం చేసినందుకు ప్రతిఫలంగా లాభాలు, ఆస్తులు సంపాదించుకోవటానికి, వచ్చే ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోవటానికి ఇంత పెద్ద స్థాయిలో డబ్బు అవసరం (ఇంత డబ్బు ఖర్చు చేసినా కొంతమందే గెలుస్తుంటారు). ఈ రాజకీయ అవినీతి.. కాంట్రాక్టులు, లైసెన్సులు, సహజ వనరుల కేటాయింపు, చట్టబద్ధ పాలనలో జోక్యం చేసుకోవటం, ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగులు, కీలక నియామకాలు వంటి వాటిని చాలా సందర్భాల్లో ప్రభావితం చేయటం వంటి వాటి ద్వారా జరుగుతుంటుంది. మరోవైపు, బదిలీలు, పోస్టింగులు, నియామకాలకు లంచం ఇచ్చిన ఉద్యోగులు, లైసెన్సులు, ఇతర రకాలైన సహాయాలు, రుణాలు, సహజ వనరుల కేటాయింపుల్ని పొందిన ఎంటర్‌ప్రెన్యూర్‌లు తాము ఇచ్చిన సొమ్మును రాబట్టుకోవటం కోసం అవినీతికి పాల్పడటమో, ఆదాయానికి గండికొట్టటమో, వ్యాపారలావాదేవీల్లో లాభాల కోసం పన్నులు ఎగ్గొట్టటమో

చేస్తుంటారు. ఇలా అక్రమ రాజకీయ ఖర్చు, ఓట్ల కొనుగోలుతో ముడిపడి సంపాదించే లెక్కలు చూపని సొమ్ము వాస్తవస్థాయి ఐదేళ్లలో రూ.100 ట్రిలియన్లు ఉంటుంది. లెక్కచూపని సంపదకు, విశృంఖల అవినీతికి తల్లివేరు.. మన రాజకీయాలు, ఎన్నికల స్వభావమే అని స్పష్టంగా తేలుతోంది.

పౌరసత్వ భావన లేని ఒక పేద దేశంలో పలు చోట్ల రాజకీయాల్ని వ్యాపారంగా భావిస్తూ అధికారమే పరమావధిగా ఓట్ల కొనుగోలు చేస్తుంటే మార్చటం ఎలా? ఓట్లకు డబ్బు విషవలయంలో అభ్యర్థులు, ప్రజలు చిక్కుకుని, ఓటుకి-ప్రజాప్రయోజనాలకీ సంబంధం తెగిపోయినప్పుడు నైతిక ఉపన్యాసాలు, ఎన్నికల కమిషన్ ఆదేశాలకు పెద్దగా విలువ ఉండదు. కాబట్టి, అభ్యర్థులు, పార్టీలు, ఓటర్లకు సరైన దిశగా ప్రోత్సహించేందుకు దిగువన పేర్కొన్న మూడు వ్యవస్థీకృత సంస్కరణలు కావాలి. అధికారం కోసం ఆరాటం అనేది రాజకీయాల స్వభావంలోనే ఉంటుంది. రాజకీయ నేతలు, పార్టీలు స్వభావరీత్యా చెడ్డవారు, చెడ్డవి కావు. అధికారాన్ని సాధించటానికి, నిలుపుకోవటానికి ఏది ఉపయోగ పడుతుందో దాన్నే వాళ్లు అనుసరిస్తుంటారు. ఓట్ల కొనుగోలు, అవినీతి, అధికార దుర్వినియోగం అనే విషవలయంతోనే అధికారం సాధ్యం అనే రీతిలో రాజకీయ సంస్కృతి, వికృత ప్రోత్సాహకాలు ఉంటే, వాళ్లు అవే పనులు చేస్తారు. నైతిక పద్ధతుల ద్వారా అధికారాన్ని సంపాదించుకోవటం, నిలుపుకోవటం సాధ్యమైతే, ఓట్ల కొనుగోలు ద్వారా లాభం కన్నా ప్రమాదాలు ఎక్కువైతే.. కచ్చితంగా వాళ్లు రాజకీయాలలో తమ తీరుని మార్చుకుని, సామాజికంగా మేలైన పద్ధతిలోనే అధికారాన్ని ఆర్జిస్తారు.

**రాష్ట్రాల్లో దామాషా పద్ధతి (నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి)**

ఎ) మన దేశానికి ఎంతో ఘనచరిత్ర, రాజకీయ నేపథ్యం ఉండవచ్చు. కానీ ఒక్క ఓటు ఎక్కువ వస్తే ఆ అభ్యర్థి మాత్రమే విజేత, మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల వ్యవస్థలో గెలుపునకు కీలకమైన కాసిని అదనపు ఓట్ల వేట.. ఇప్పుడు మన పేదదేశంలో ఓట్ల కొనుగోలుకు మూలంగా ఉంది. గెలుపునకు కావలసిన ఆ కొద్ది ఓట్ల కోసం.. ప్రధాన పోటీదారుల్లో చాలామంది అభ్యర్థులుగా, పార్టీలుగా విచ్చలవిడి ఓట్ల కొనుగోలుకు పాల్పడుతున్నారు. ఎంత ఖర్చు చేసినా గెలుపునకు గ్యారంటీ ఉండదుగానీ, ఎన్నికలలో బలమైన అభ్యర్థిగా పోటీలో ఉండాలంటే, భారీయెత్తున లెక్కలు చూపని డబ్బు ఖర్చు చేయటం కనీస అర్హతగా మారింది. ఈరకంగా, రాజకీయ విజయానికి డబ్బు గ్యారంటీ ఇవ్వకపోయినా, ఓ తప్పనిసరి ప్రవేశ రుసుముగా మారి నిజమైన రాజకీయ పోటీని, రాజకీయాలలో ఆరోగ్యకర ప్రోత్సాహకాల్ని ఛిన్నాభిన్నం చేసి అనర్హులను, తప్పుడు వ్యక్తులను ప్రోత్సహించి ప్రజాసేవాభావంగల సమర్థ పౌరులను రాజకీయాలకు దూరం చేసింది. అవినీతి, దుష్పరిపాలన, అయినకాడికి దండుకుందామనే నిరాశావాదం, అసమర్థతలమయమైన వ్యవస్థను సృష్టించింది.

ఒక రాష్ట్రంలో ఓ పార్టీకి వచ్చిన ఓట్ల వాటాను బట్టి సీట్లను కేటాయిస్తే (దామాషా ఎన్నికల పద్ధతి) గెలుపు కోసం అదనపు ఓట్లు ఇక కీలకం అవ్వవు. ఒక్క ఓటుతో గెలిచినవారిదే విజయం అవదు. ఓట్ల కొనుగోలుకు బరితెగింపు, వెంపర్లాట ఉండవు. నైతిక పౌరబృందాలకు, పార్టీలకు అవకాశాలు ఉంటాయి. పాలనలో ఏకాభిప్రాయ సాధన తప్పనిసరి అవుతుంది. అన్ని రకాల భావాలకూ ప్రాతినిధ్యం లభిస్తుంది. నైతిక రాజకీయాలు, నిజమైన ప్రజాసేవాభావం గల వారు పార్టీలకు ఓ భారంలా కాకుండా బలంగా మారతారు.

దామాషా ఎన్నికల పద్ధతి (పి.ఆర్)లో రకరకాల నమూనాలున్నాయి. కానీ రాష్ట్రాల్లో కనీస స్థాయి ఓట్ల శాతం ప్రాతిపదికగా సీట్ల కేటాయింపు చేయటం, ప్రజలకు, వారి ప్రజాప్రతినిధులకు సంబంధం కొనసాగడానికి బహుళ సభ్యత్వ నియోజకవర్గాలను ఏర్పాటు చేయటం భారతదేశ పరిస్థితులకు అత్యుత్తమ నమూనా.

అటువంటి పి.ఆర్ విధానాన్ని ప్రవేశపెట్టటం సాంకేతికంగా కూడా తేలిక. కేవలం చట్టంలో మార్పు చేస్తే చాలు. అయితే, కేంద్రంలో ఒక ప్రధాన పార్టీ ఎఫ్.పి.టి.పి విధానం ద్వారా లబ్ధి పొంది స్పష్టమైన మెజారిటీని సాధించింది కాబట్టి జాతీయ స్థాయిలో దీన్ని అమల్లోకి తేవటం ఇప్పటికిప్పుడు కష్టం కావచ్చు. అయినా, జాతీయస్థాయిలో రాజకీయ ఏకాభిప్రాయం కుదిరితే రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల నమూనాను అమలు చేయవచ్చు. అసలైన రాజకీయాలు, పాలనా సవాళ్లు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. బ్రిటన్ (యునైటెడ్ కింగ్‌డమ్)నే తీసుకుంటే, జాతీయ, రాష్ట్రాల స్థాయిల్లో ఒకేరకమైన ఎఫ్.పి.టి.పి ఎన్నికల నమూనా ఉండనక్కర్లేదని అర్థమవుతుంది. యు.కెలో దిగువసభను ఎఫ్.పి.టి.పి నమూనాలో ఎన్నుకుంటే, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్, వేల్స్‌లోని ప్రాంతీయ పార్లమెంటుల్ని దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఐరోపా

పార్లమెంట్ సభ్యులు ఇప్పటి వరకూ ఇలాగే ఎన్నికవుతున్నారు (బ్రెగ్జిట్ వాస్తవరూపం దాల్చేంతవరకు). అదేవిధంగా లండన్ మేయర్‌ని ప్రజలంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.

కాబట్టి దామాషా ఎన్నికల పద్ధతి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పనికొచ్చే ఆచరణాత్మకమైన సంస్కరణ. రాష్ట్రాల్లో రాజకీయాలు, పాలన స్వభావాన్ని సమూలంగా మార్చగల సంస్కరణ. ప్రతి పౌరునీ ప్రభావితం చేసే పాలన రాష్ట్ర, స్థానిక స్థాయిల్లోనే ఉంది కాబట్టి, దీనికి సమూల పరివర్తనా శక్తి ఉంది. బహుళ సభ్యత్వ నియోజకవర్గాలకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది కాబట్టి ఈ ఎన్నికల ఏర్పాటుని పార్లమెంటులో ఒక సాధారణ చట్టం తెచ్చి అమలు చేసేయొచ్చు.

## రాష్ట్రాల్లో ప్రత్యక్ష ఎన్నికలు

బి) లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు 'ఒకేసారి ఎన్నికల' గురించి ఇప్పుడు విస్తృతస్థాయి చర్చ జరుగుతోంది కనుక, ఈ లక్ష్యాన్ని అమలు చేయటానికి రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతను ప్రత్యక్షంగా ప్రజలంతా కలిసి ఎన్నుకోవటం అత్యుత్తమ మార్గమవుతుంది. అధికారాల విభజన, నిర్ణీత పదవీకాలం, పోటీ పరిమితులు, అసెంబ్లీ వెలుపలి నుంచి కూడా సమర్థులను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ప్రభుత్వాధినేతకు స్వేచ్ఛ వంటివి ఈ ఏర్పాటులో భాగంగా ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా ఎన్నుకుంటున్నప్పుడు అభ్యర్థి ఓట్ల కొనుగోలును ఆ స్థాయిలో చేయటం దాదాపు అసాధ్యమవుతుంది. వచ్చే లాభం కంటే చేసే అక్రమ ఖర్చు అనేకరెట్లు ఎక్కువ ఉంటుంది కాబట్టి ఓట్ల కొనుగోలుతో పోటీకి సాహసం చేయరు. అప్పుడు నాయకులు, పార్టీలు ఓట్ల కొనుగోలుకన్నా వ్యక్తిత్వం, నిజాయతీ, గతంలో తాము చేసిన పనులు, అభ్యర్థి విశ్వసనీయత, ఎజెండా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. అదేసమయంలో, ప్రభుత్వాధినేత (ముఖ్యమంత్రి) తన మనుగడ, పాలన కోసం శాసనసభలో మెజారిటీ మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఫిరాయింపుల ద్వారానో, మరో రూపంలోనో ఎమ్మెల్యేలు తమ పదవిని అడ్డంపెట్టుకుని ప్రజాధనాన్ని దండుకునే అవకాశాలు ఉండవు (బదిలీలు, కాంట్రాక్టులు, ఇతర అనుచిత సహాయాల కోసం ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయలేరు). కాబట్టి, ఓట్ల కొనుగోలు కోసం భారీ పెట్టుబడులు పెట్టటం ఎంతమాత్రం లాభసాటి అవదు. ఈరకంగా మొత్తం వ్యవస్థ విషవలయం నుంచి ఓ మేలిమి వలయంలోకి ప్రవేశిస్తుంది. నల్లడబ్బు, అవినీతి గణనీయంగా తగ్గుతాయి.

## జవాబుదారీతనం, సాధికారత ఉన్న స్థానిక ప్రభుత్వాలు

సి) ప్రజలు తమ ఓటుకు-తమ జీవితాల్లో ప్రయోజనాలకు, పన్నులకు-సేవలకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునేలా చేసేవి- సరైన నిర్మాణం, జవాబుదారీతనం ఉన్న స్థానిక ప్రభుత్వాలే (రెసిడెంట్స్ సంక్షేమ సంఘాలు- ఆర్‌డబ్ల్యుఏల తరహాలో). ఇలాంటి సాధికారత గల స్థానిక ప్రభుత్వాల్లో అధికారాన్ని జవాబుదారీతనంతో సంధానం స్పష్టంగా చేయొచ్చు. జవాబుదారీతనానికి కచ్చితమైన గీతలుంటాయి, బాధ్యతల నుంచి తప్పించుకుని కుంటిసాకులు చెప్పటానికి అవకాశముండదు. ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న జాబితా ప్రకారం బాధ్యతల్ని బదిలీ చేసి స్థానిక ప్రభుత్వాలను నిజమైన మూడో అంచె ప్రభుత్వాలుగా గుర్తించి, రాష్ట్రాలతోపాటు ఆర్థిక సంఘం ద్వారా నిర్దిష్ట వాటా నిధుల్ని పంపిణీ చేస్తే మన ప్రజాస్వామ్యంలో పెద్దఎత్తున పరివర్తన చోటుచేసుకుంటుంది. ఓట్ల కొనుగోలు, నల్లధనం, అవినీతి బాగా తగ్గుతాయి. మేలిమి వలయం వేళ్లూనుకునేలోగా.. సర్వాంతర్వ్యామిగా వున్న అవినీతి, దుష్పరిపాలనల విషవలయం స్థానిక ప్రభుత్వాలను నాశనం చేయకుండా మనకు పటిష్టమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల స్థానిక అంబుడ్స్‌మన్ కూడా ఉండాలి.

ఈ ఐదు మౌలికమైన సంస్కరణలు- హక్కుగా పౌరసేవలు, సుపరిపాలనకు తగ్గ పన్ను రేట్లు, రియల్ ఎస్టేట్, భారీ లాలూచీ అవినీతి నియంత్రణ, ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన- కూడా మనకు అందుబాటులో వున్న, మనం సాధించుకోదగ్గ లక్ష్యాలు. డీమానిటైజేషన్ కష్టమైన, భారీస్థాయి కార్యక్రమం. ప్రభుత్వం ఈ పెద్ద అడుగు వేసింది కాబట్టి, ఈ ప్రధాన సంస్కరణలను కూడా ప్రజలు స్వాగతిస్తారు. మనకు కావలసిందల్లా- లక్ష్యం పట్ల స్పష్టత, స్పష్టమైన వ్యూహం, స్వేచ్ఛా సమాజాలు ఎలా పనిచేస్తాయో లోతైన అవగాహన. ఈ సంస్కరణల్ని ప్రభుత్వంగనక ప్రతిపాదిస్తే, మొదటి నాలుగింటినీ తేలికగా, జనరంజకంగానే అమలు చేయవచ్చు. ప్రధానమైన రాజకీయ సంస్కరణకు ప్రజల మద్దతు, స్థూల ఏకాభిప్రాయ సాధనతో తగిన పరిస్థితుల్ని కల్పించవచ్చు. సమయం వృధా కాకుండా చూసుకోవటం ముఖ్యం. యధాతథవాదంతోనో, ఏకపక్ష వ్యవహారశైలితోనో ఈ వెలకట్టలేని అవకాశాన్ని దుర్వినియోగం చేస్తే, సానుకూల మార్పునకు ఓ గొప్ప ఊపుని మళ్లీ చాలాకాలంపాటు సాధించు కోలేకపోవచ్చు! ◈

# 'ఒకే దేశం-ఒకే ఎన్నిక-సురాజ్యం' కోసం..

- డా॥ జయప్రకాష్ నారాయణ్




భారతదేశంలో ఎన్నికలంటే పండుగే. కానీ తరచూ ఎన్నికలు పాలనకు అవరోధాలుగా కూడా తయారవుతాయి. ప్రజాధనాన్ని హరిస్తూ పోటాపోటీ తాత్కాలిక తాయిలాలకు దారితీస్తాయి. ఎన్నికల పట్ల రాజకీయ నాయకులకుండే వ్యామోహం విధాన నిర్ణయాలకు నిరంతరం గండికొడుతుంటుంది. ప్రతీ ఎన్నికల సమయంలో అమలు చేసే ప్రవర్తనా నియమావళి పాలనను స్తంభింపచేస్తుంటుంది. మధ్యంతర ఎన్నికలు, సుదీర్ఘ ఎన్నికల షెడ్యూళ్ల వల్ల అధికారుల్లో అత్యధికశాతం ఎన్నికల నిర్వహణలో నెలల తరబడి మునిగితేలుతుంటారు. ప్రభుత్వంలో భాగంగా విధిగా చేయాల్సిన తమ బాధ్యతల్ని, మౌలిక సేవల్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. వీటన్నిటికీ తోడు మనదేశం పేదరికం వల్ల, ఎలాగోలా ఎన్నికల్లో గెలవాలనుకునే పార్టీల వల్ల విధానపరంగా కూడా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, ఆదాయం పెంపు, పేదరికాన్ని తగ్గించే విధానాలను ఫణంగా పెట్టి మరీ ప్రజల్ని మైమరపించి ఆకట్టుకోవడానికి.. తాత్కాలికమైన, ఎదిగే అవకాశాలనివ్వని ఉచితాల కోసం వనరుల్ని, ప్రజల పన్నుల డబ్బుని వెదజల్లటం రాజకీయంగా మారిపోయింది.

క్రమం తప్పకుండా నిర్ణీత కాలవ్యవధిలో, సమయంలో దేశవ్యాప్త ఎన్నికల షెడ్యూల్ వల్ల, జాతీయ – రాష్ట్ర – స్థానిక.. ఇలా అన్నిస్థాయిల్లో ప్రభుత్వాలకీ ఒకేసారి ఎన్నికల వల్ల ఈ సమస్యలను అధిగమించి పాలనను మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుంది. అయితే మధ్యలో ఖాళీ అయ్యే సీట్లను సాధారణ ఎన్నికల్లాగే పాలనను గందరగోళపరిచే మధ్యంతర ఎన్నికలు లేకుండా భర్తీ చేసేందుకు ఒకే దేశం – ఒకే ఎన్నిక విధానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సుంటుంది.

లోతుగా చూస్తే.. ఒకేసారి ఎన్నికలు వాంఛనీయమేగానీ, వాటంతటవే మన రాజకీయాలు, పాలన స్వభావాన్ని సమూలంగా మార్చలేవు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషాలకు లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు ఒకేసారి జరుగుతున్నాయి. అంతకుముందు కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు కూడా అదేరీతిలో జమిలి ఎన్నికలు ఉండేవి. కానీ కేవలం ఒకేసారి ఎన్నికల వల్ల ఈ రాష్ట్రాల్లోని పాలనా వ్యవస్థల్లో చెప్పుకోదగిన మంచి మార్పులు వచ్చిన దాఖలాలు లేవు. ఒకే దేశం – ఒకే ఎన్నిక అనేది వాంఛనీయం అనే దాంట్లో సందేహం అక్కర్లేదు. కానీ ఇది ఓ చిన్న మార్పు మాత్రమే. దానంతటదే మన ప్రజాస్వామిక ప్రక్రియను, పాలనను మెరుగుపరచగలిగే గేమ్ ఛేంజర్ కాదు. ఆటనియమాలు మార్చే స్థాయిలో దీన్ని ఉపయోగించుకోవాలంటే.. అదనంగా కొన్ని మార్పుల్ని జోడించుకోవాలి.

ఎన్నికలు, రాజకీయ ప్రక్రియకు ప్రజాస్వామ్యంలో నాలుగు లక్ష్యాలున్నాయి. వీటిని ఆచరణలో చూపటం మీదే ప్రజాస్వామ్యం ఆధారపడివుంటుంది. మొదటిది, అత్యుత్తములు, మెరికల్లాంటి వాళ్లు ప్రజాజీవితంలోకి రావటాన్ని అవి ప్రోత్సహించాలి. రెండోది, జనహితాన్ని పెంపొందించేలా నిండైన నిజాయతీ, సమర్థత, ప్రజాసేవాభావం గల అభ్యర్థులు నైతిక పద్ధతుల్లో ఎన్నికవగలగాలి. మూడోది, విధానాలు, ప్రాధమ్యాల విషయంలో పార్టీలు స్పష్టమైన ప్రత్యామ్నాయాలను ప్రజల ముందుంచగలగాలి. నాలుగు, ఒక్కసారి ఎన్నికయ్యాక అధికారంలో ఉన్నవాళ్లు జనజీవితాల్ని ప్రభావితం చేసే విధంగా, ఎన్నికల్లో తీర్పునకు అనుగుణంగా పాలన చేయగలగాలి. మన ప్రజాస్వామిక ప్రక్రియలో ఈ నాలుగు లక్ష్యాల్లో ఏ ఒక్కటీ సంతృప్తికరంగా నెరవేరటం లేదు. సమాజంలో అత్యుత్తములు, మెరికల్లాంటి వారు ఎన్నికల రాజకీయాల తీరును చూసి నిరుత్సాహంతో వెనక్కిపోవటం పరిపాటిగా మారింది. భారీస్థాయి ఓట్ల కొనుగోలు, తాత్కాలిక తాయిలాలు, ఉచితాలు, ప్రజల్ని నిస్సిగ్గుగా చీల్చటం, సామాజిక విభజనల్ని ఎగదోయటం ఎన్నికలలో విజయానికి గ్యారంటీ మార్గాలుగా తయారయ్యాయి. చాలా సందర్భాల్లో– లక్ష్యంలేని అధికారం కోసమే ఎన్నికలు జరుగుతున్నాయి. అరుదుగా మాత్రమే ఎన్నికల్లో స్పష్టమైన విధానపర ఎంపికకు అవకాశం ఉంటోంది. వ్యవస్థలోని అవరోధాలు పాలనను కష్టమైనది, ఫలితంలేనిది, అసంతృప్తిని పెంచేదిగా తయారుచేస్తున్నాయి. మనదేశంలో ఎన్నికల్లో గెలవటానికి కావలసిన అర్హతలు, పద్ధతులకు – ప్రజా ప్రయోజనకర మంచి పరిపాలనకు కావలసిన నైపుణ్యాలు, అర్హతలకు పొంతన లేకుండా పోయింది. ఈ వినాశకర

వైరుధ్యమే ఈవేళ మన రాజకీయ ఫార్ములాగా మారింది.




ఒకే దేశం – ఒకే ఎన్నికను అమలు చేయటానికి పెద్దఎత్తునే రాజ్యాంగ మార్పుల కసరత్తు కావాలి. ఇంత ప్రయాసపడినా, ఈ ఒక్కటే అమలు చేయటం వల్ల ప్రయోజనాలు పరిమితంగానే దక్కుతాయి. కాబట్టి ఒకేసారి ఎన్నికల పట్ల ఇప్పుడు సర్వత్రా కనిపిస్తున్న ఆసక్తిని మన ఎన్నికల వ్యవస్థను మెరుగుపరిచే సదవకాశంగా వినియోగించుకోవటం అవసరం. ఓట్ల కొనుగోలు, ఉచితాలు లేకుండా అత్యుత్తములు ఎన్నికవగలిగేలా చేస్తూ పాలనలో స్థిరత్వాన్ని, పోటీతత్వాన్ని పెంచేందుకు, రాజకీయాల్లో సమూల పరివర్తన సాధించేందుకు ఎన్నికల వ్యవస్థను పునర్నిర్మించాలి.

మన పాలనను మెరుగుపరుచుకోవటానికి, ఒకేసారి ఎన్నికలకు ఆచరణాత్మక మార్గాలు అందుబాటులోనే ఉండటం సంతోషించాల్సిన విషయం.

మన పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో, కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించినా, రాష్ట్రాల్లో కొంతకాలం తర్వాత మధ్యంతర ఎన్నికలు అవసరం కాబోవనే గ్యారంటీ ఏమీ లేదు. కాలక్రమంలో మధ్యంతరం పేరుతో మళ్లీ ఎన్నికలు జరుపుతుంటే ఇంత బృహత్ ప్రయత్నమూ, అసలు లక్ష్యమూ విఫలమైనట్టే. పార్లమెంట్‌కి నిర్ణీత స్థిర కాలవ్యవధి, లోక్‌సభకు ప్రతి ఐదేళ్లకూ సాధారణ ఎన్నికలు, జాతీయస్థాయిలో స్థిరమైన ప్రభుత్వం – వీటన్నిటినీ రాజకీయ ఏకాభిప్రాయం ఉంటే తేలిగ్గానే ఏర్పాటు చేసుకోవచ్చు.

పార్లమెంట్‌కి నిర్ణీత స్థిర కాలవ్యవధి ఉండేలా గ్రేట్ బ్రిటన్ (యు.కె)లో 2011లో తెచ్చిన చట్టం తరహాలో మనమూ చట్టాన్ని అమలు చేయవచ్చు. దీనివల్ల మధ్యలో రద్దుకాకుండా లోక్‌సభ పూర్తికాలం కొనసాగుతుంది. ఈ చట్టం ప్రకారం, మొత్తం సభలో మూడింట రెండొంతుల మంది అంగీకరిస్తేనే, ముందస్తు సాధారణ ఎన్నికల్ని నిర్వహించవచ్చు. అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనను 14 రోజుల్లో వెనక్కితీసుకోవచ్చు, ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా దేన్నీ ధృవీకరించకపోతే సభను రద్దు చేయటం అవసరమవుతుంది. అటువంటి చట్టంతో పాటు జర్మనీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 57 తరహాలో 'నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానం' నిబంధనను మన రాజ్యాంగంలో చేర్చుకోగలిగితే.. మెజారిటీ మద్దతుతో తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రత్యామ్నాయం ఉంటేనే, సభలో కేంద్ర ప్రభుత్వాన్ని పడగొట్టటానికి అనుమతి ఉంటుంది. ఈ ఏర్పాట్లు ఉన్నా కూడా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ముందుగానే సభను రద్దు చేయాల్సిన అవసరం కొన్ని సందర్భాలలో వస్తుంటుంది. ఉదాహరణకి, బ్రిటన్ (యు.కె) చట్టం ప్రకారం, మూడింట రెండొంతుల సభ్యుల అంగీకారం ఉన్నా, లేదా అవిశ్వాస తీర్మానాన్ని 14 రోజుల్లోగా ఆమోదించినా రద్దవుతుంది. అదేవిధంగా, జర్మనీలో మెజారిటీ మద్దతును కోల్పోయిన ఛాన్సలర్ రద్దును ప్రతిపాదించవచ్చు. ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశాలు లేకుంటే 21 రోజుల తర్వాత సభ రద్దవుతుంది. అయితే, స్థూల రాజకీయ ఏకాభిప్రాయం ఉంటే చాలా సందర్భాల్లో లోక్‌సభకు నిర్ణీత స్థిర కాలవ్యవధి సాధ్యమే.

కానీ దేశంలోని 29 రాష్ట్రాల్లో పరిస్థితి ఇందుకు చాలా భిన్నమైనది. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో సభలో మెజారిటీ ఉన్నంత వరకే ప్రభుత్వం మనుగడలో ఉండి సక్రమంగా పనిచేయగలుగుతుంది. భారత్‌లోని సంక్లిష్టతలు, ప్రపంచంలోనే మరెక్కడా లేనిరీతిలో వివిధ ప్రాంతాల్లో ఎదురయ్యే సవాళ్ల వల్ల మనం అన్ని రాష్ట్రాల్లో శాసనసభలకు దీర్ఘకాలం నిర్ణీత స్థిర వ్యవధికి హామీ ఇవ్వలేం. రాజకీయ అస్థిరత, స్థానికంగా శాంతి భద్రతల వైఫల్యం, రాష్ట్రంలోపల రాజ్యాంగ సంక్షోభం, కొన్ని ప్రాంతాల్లో వేర్పాటువాద ధోరణులు, ఇంకా ఊహించని పరిణామాలు ఇలా ఏదోక రాష్ట్రంలో ఏదోకటి తలెత్తే అవకాశం ఉంది. దీనివల్ల, అసెంబ్లీని మధ్యలోనే రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈరకంగా, వెస్ట్‌మినిస్టర్ పార్లమెంటరీ నమూనాలోనే, ఒక ఫెడరల్ వ్యవస్థలో లోక్‌సభకు, అన్ని రాష్ట్రాలకుఅసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు ఆచరణలో అసాధ్యమైనవిగా పరిణమిస్తుంటాయి. కాబట్టి, రాజకీయంగా ఎన్ని వనరుల్ని, శక్తిసామర్థ్యాల్ని, సమయాన్ని పెట్టుబడిగా వెచ్చించినా, ఏకాభిప్రాయాన్ని సాధించి రాజ్యాంగంలో పెద్ద మార్పుల్ని తెచ్చినా.. లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఎన్నికలు దీర్ఘకాలంలో నిర్వహించటం కష్టసాధ్యం కావచ్చు. ఇప్పుడు జరుగుతున్నట్టు మధ్యలో కొన్ని ఎన్నికలు వస్తూనే ఉంటాయి. దీనివల్ల ఇంత పెద్ద ప్రయత్నమూ దేశానికి చివరికి స్వల్ప ఫలితాలనే ఇస్తుంది.

ఈ నేపథ్యంలో.. ఒకే దేశం – ఒకే ఎన్నిక పట్ల ఇప్పుడు దేశంలో కనిపిస్తున్న సానుకూలతను, ఉత్సాహాన్ని దీర్ఘకాలిక లక్ష్యాల కోసం సృజనాత్మకంగా వినియోగించుకునే ప్రయత్నం అవసరం. రాష్ట్ర ప్రభుత్వాలు మనుగడ కోసం అసెంబ్లీల మీద ఆధారపడకుండా చేయటం ద్వారా రాజకీయాల, పాలన స్వభావాల సమూల పరివర్తనకు నాంది పలకాలి. ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర ప్రభుత్వ సారథి అసెంబ్లీలో మెజారిటీ మద్దతు ద్వారా కాకుండా ప్రజల ద్వారా ప్రత్యక్షంగా ఎన్నికైతే.. అప్పుడు ప్రభుత్వం, శాసనసభను మధ్యలో రద్దు చేయాల్సిన అవసరం లేకుండా నిర్ణీత స్థిర వ్యవధిని నిర్ణయించవచ్చు. అటువంటి అధికారాల విభజన వల్ల రాష్ట్రాల్లో చాలా ఉపయోగాలు కూడా ఉంటాయి. ఇవి పాలనను సమూలంగా మార్చగలవు. ఒక్కసారి ప్రభుత్వం ఏర్పాటుని అసెంబ్లీ సీట్లతో సంబంధం లేకుండా చేస్తే, ఓట్ల కొనుగోలు పాత్ర గణనీయంగా పడిపోతుంది.

ప్రస్తుతం ఓట్ల కొనుగోలుకి ఒక్కో అసెంబ్లీ అభ్యర్థి రూ. 5–10 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అధికారం కోసం ఆ ఖర్చు గిట్టుబాటు, లాభసాటి కూడా అవుతుందనే చాలామంది భావిస్తున్నారు. లక్ష్యంతో పొంతనలేకుండా జరిగే ఎన్నికల్లో అభ్యర్థులు ఒక్కొక్కరుగా చేసే డబ్బు రిస్కు మొత్తంగా చూస్తే చిన్నదే. అంత భారీ డబ్బును ఖర్చు చేశాక నెగ్గితే, ఆ పెట్టుబడికి అనేకరెట్లు దండుకోగలుగుతాడు. ప్రభుత్వ మనుగడ ఎమ్మెల్యేలను మచ్చికచేసుకోవడం మీద ఆధారపడటంతో.. అవినీతి, అధికార దుర్వినియోగం, రోజువారీ పాలనలో రాజ్యాంగ వ్యతిరేకంగా జోక్యం చేసుకోవటం, చట్టబద్ధపాలన తరచూ విఫలమవటం మొండిజబ్బులా రాష్ట్రాల్లో మన రాజకీయ వ్యవస్థను పట్టిపీడిస్తోంది. భారతదేశంలో రాజకీయాలకు అసలైన యూనిట్ ఇప్పుడు రాష్ట్రం, అసెంబ్లీ నియోజకవర్గం అని మనం గుర్తించాలి. నిజమైన పాలనా సంక్షోభం కూడా రాష్ట్రాల్లోనే ఉంది. పౌరుల రోజువారీ జీవితాల్ని రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల పనితీరే గదా ప్రభావితం చేసేది!

ఇలాంటప్పుడు, మొత్తం రాష్ట్రానికి సారథ్యం వహించే నాయకురాలు/నాయకుడు గనక ప్రత్యక్షంగా ఎన్నికైతే, ఆమె/అతడు ఓట్ల కొనుగోలుపై తక్కువ ఆధారపడి సొంత వ్యక్తిత్వం, గత చరిత్ర, పేరుప్రతిష్టలు, ఎజెండా, ప్రచారం మీద ఎక్కువ ఆధారపడతారు. గంపగుత్తగా ఓట్ల కొనుగోలును ఓ పెద్ద రాష్ట్రంలో చేయాలంటే లెక్కలు చూపని, అక్రమ సొమ్ముతో రూ. 2000–4000 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అటువంటి భారీ, బహుళ రిస్కుని శాసన సభ్యులతో సంబంధం లేకుండా కేవలం ఒక వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వ సారథి పదవి కోసం తీసుకోవటం లాభసాటిగా కనిపించదు. మరోవైపు, ప్రభుత్వ మనుగడను ప్రభావితం చేసే అవకాశం లేకపోవటంతో ఎమ్మెల్యే కూడా తన శాసనసభ్యత్వాన్ని వ్యక్తిగత లబ్ధికి దుర్వినియోగం చేసే అవకాశాలు బాగా తగ్గుతాయి. ఈరకంగా ఆటనియమాల్ని మార్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు లాభసాటిగా ఉండదు కాబట్టి.. గణనీయంగా పడిపోతుంది. దీంతో పార్టీలు, అభ్యర్థులు, ఓటర్ల ప్రవర్తన కూడా మారుతుంది. ఓట్ల కొనుగోలు స్థానంలో.. నిజాయతీతో కూడిన ప్రభావం చూపే ప్రయత్నం మొదలవుతుంది. మెరుగైన స్థాయి అభ్యర్థులు ముందుకు వస్తారు. ఎన్నికల్లో గెలుపుకి, ధన రాజకీయానికి సంబంధం తగ్గుతుంటుంది. అభ్యర్థుల వ్యక్తిత్వం, ఎజెండా, విశ్వసనీయతే గెలుపునకు కీలకమవుతాయి.

ఎన్నికల స్వభావాన్ని మార్చటం, ఓట్ల కొనుగోలుని తగ్గించటం, రాజకీయాల్లో లెక్కలు చూపని డబ్బుల పాత్రని నిర్మూలించటం, రాష్ట్రాల్లో ప్రభుత్వ సారథుల ప్రత్యక్ష ఎన్నిక.. పాలనపై ప్రగాఢ సానుకూల ప్రభావం చూపుతాయి. ఒక్కసారి అధికారాల విభజన జరిగి, శాసనసభ నుంచే కాకుండా సమాజం నుంచి క్యాబినెట్ ఏర్పడితే.. ప్రజాసేవాతత్పరత, ప్రతిభానైపుణ్యాలు గల అత్యుత్తమ పౌరులు మంత్రివర్గంలో నియమితులవుతారు. పరిపాలనలో నాణ్యతా ప్రమాణాలు పెరిగి కొత్తపుంతలు తొక్కుతుంది. బడ్జెట్ విషయంలో, చట్టాలు చేయడంలో శాసనసభ నియంత్రణ ఉంటుంది కాబట్టి ప్రభుత్వం కూడా తన పరిధుల్లోనే వ్యవహరించాల్సుంటుంది. ఇలా పరస్పర పర్యవేక్షణతో సమతులపరిచే ఏర్పాట్ల వల్ల ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేయకతప్పదు. ప్రభుత్వ వ్యవహారాల్లో ఎమ్మెల్యేకి పాత్ర ఉండదు కాబట్టి, స్థానిక ప్రభుత్వాలను తమ రాజకీయ ఉనికికి ప్రమాదంగా శాసనసభ్యులు ఇక భావించరు. దీంతో స్థానిక ప్రభుత్వాల సాధికారత అనే సుదీర్ఘ స్వప్నం కూడా నెరవేరి నిజమైన మూడో అంచె ఫెడరలిజం వ్యవస్థీకృతమవుతుంది.

రాష్ట్రాల్లో ప్రభుత్వాల సారథుల ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఒక్కసారి స్థిరత్వం, నిర్ణీత పదవీకాలం, నిజాయతీ, పోటీ గనక స్థిరపడితే.. రాష్ట్రాల ఎన్నికలను లోక్‌సభతో సంధానం చేయటం తేలికవుతుంది. శాశ్వత ప్రాతిపదికన, ఒడిదుడుకులు లేకుండా ఒకేసారి నిర్వహించవచ్చు. స్థానిక ప్రభుత్వాల నిర్మాణపరంగా కూడా లోక్‌సభ, రాష్ట్రాల సారథులు, అసెంబ్లీల ఎన్నికలతోపాటు స్థానిక ఎన్నికలను కూడా నిర్వహించటం తేలిక, ఆచరణసాధ్యమవుతాయి.

లోక్‌సభకు నిర్ణీత స్థిర కాలవ్యవధి, రాష్ట్ర ప్రభుత్వాల సారథులకి ప్రత్యక్ష ఎన్నికతోపాటే అసెంబ్లీలకు ఎన్నికలు, నిధులు, అధికారాలుగల స్థానిక ప్రభుత్వాలు, కేంద్ర–రాష్ట్ర–స్థానిక ఈ మూడు అంచెల్లోనూ ఒకేసారి ఎన్నికలు.. భారత ప్రజాస్వామ్యంలో సమూల మార్పుని సాధ్యం చేసి సుపరిపాలనను, ప్రజాజీవితంలో నిజాయతీని వ్యవస్థలో భాగంగా మారుస్తాయి. 'ఒకే దేశం – ఒకే ఎన్నిక – సురాజ్యం' వాస్తవరూపం దాలుస్తుంది. ◈

# కేంద్రీకృత దుష్పరిపాలనా? ఇకనైనా స్థానిక స్వయంపాలనా?

- డా॥ జయప్రకాష్ నారాయణ్





ఎంతో సాహసోపేతమూ, అసాధారణమూ అయిన రీతిలో వయోజనులందరికీ ఓటుహక్కును ఇచ్చిన దేశం భారత్! ప్రజాస్వామిక వ్యవస్థల అనుభవం లేని ఏ ఇతర పేద దేశమూ ఇలా తొలినుంచీ అందరికీ ఓటుహక్కును అప్పటిదాకా ఇవ్వలేదు. మన జాతీయోద్యమ నాయకత్వ ఘనత ఇది! పనిచేసే ప్రజాస్వామిక వ్యవస్థల్ని వాళ్లు విజయవంతంగా నిర్మించగలిగారు. కాబట్టే.. అసాధ్యమనిపించే అవరోధాలున్నా, స్వేచ్ఛను పరిరక్షించుకోగలిగాం, బ్యాలెట్ ద్వారా అధికారమార్పిడి శాంతియుతంగా జరుగుతూ వస్తోంది, విజయవంతమైన పరిణతిగల ఫెడరలిజం రూపుదిద్దుకుంది. ఊహకు కూడా అందని సంక్లిష్టతలు, భిన్నత్వంతో కూడిన అనేక తెగలు, కులాలు, భాషల మధ్య కూడా.. ఏదోకస్థాయి ఆర్థిక పురోగతి మన సమాజంలో కనిపిస్తోంది.

అయితే, మనం ఇంతకంటే మెరుగ్గా సాధించగలం గదా అని బాధపడనివారు మనలో దాదాపు ఉండరు. మన సామర్థ్యానికి, మన విజయాలకు మధ్య అంతరం అంత ఎక్కువగా ఉంది. తోటి దేశాలతో పోల్చి చూసుకుంటే.. మనం చాలా వెనకబడ్డాం. మన వైఫల్యాలకు మన ప్రజాస్వామ్యమే కారణమని కొందరు నిందిస్తుంటారు. శక్తిమంతమైన చైనాని, విజయవంతమైన సింగపూర్‌ని, ఆధునిక దక్షిణ కొరియాని చూపిస్తూ.. అతి ప్రజాస్వామ్యం, రాజకీయాలు మనల్ని వెనక్కిలాగాయని వాపోతుంటారు. ఈ విమర్శలన్నీ శుద్ధ తప్పు అని ఏమాత్రం సంకోచించకుండానే తిప్పికొట్టచ్చు. ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదు! ప్రజాస్వామ్యంలోని లోపాల్ని మరింత ప్రజాస్వామ్యంతోనే అధిగమించగలం తప్ప స్వేచ్ఛను కోల్పోయి మాత్రం కాదు.

ఒక పట్టణం, నగరంలోని కాలనీనో, గేటెడ్ కమ్యూనిటీనో, అపార్ట్‌మెంట్ సముదాయంలో ఉండే రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఏ)నో చూడండి. అక్కడుండే అన్ని ఇళ్లల్లోనివారు తమ ఉమ్మడి అవసరాలకు కొంత డబ్బును మెయింటినెన్స్ ఛార్జీల పేరుతో (పన్నుల మాదిరిగా) చెల్లిస్తారు. తాము ఖర్చు పెడుతున్న డబ్బుకు తగ్గ సేవల్ని (గేటు వద్ద సెక్యూరిటీ, సరైన పార్కింగ్, పనిచేసే లిఫ్ట్, రోజూ నీటి సరఫరా, ఆవరణలో మంచి రోడ్లు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థ వంటివి) కోరుకుంటారు. ఉమ్మడి సదుపాయాల్ని మెరుగుపరచటానికి నిర్మొహమాటంగా ఒత్తిడి తెస్తూంటారు. ఈ రకమైన నిర్వహణను ఎవరు సమర్థవంతంగా చేయగలరో, కమిటీని జవాబుదారీ చేయగలరో వారినే ఎన్నుకుంటారు. ఇంకోరకంగా చెప్పాలంటే, 'ఓటుకి – ఉమ్మడి ప్రయోజనాలు, నిర్వహణ ఛార్జీలు (పన్నులు), సేవలకు' మధ్య ఉండే స్పష్టమైన లింకులు అక్కడ వ్యవస్థీకృతమయ్యాయి. జవాబుదారీతనంతో కూడిన అధికారం అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. దీనివల్ల ప్రజాస్వామ్యం.. అక్కడున్న అందరి వ్యక్తిగతమైన పనిలా మారింది. అందరి ఉత్సాహపూరిత భాగస్వామ్యం ఉండటంతో అందరూ కోరుకునే, అందరికీ అవసరమైన ఫలితాలను ఇస్తోంది.

అలాగే మనలో పలువురు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించే అమెరికానే చూద్దాం. ఆ దేశంలో తుది నిర్ణయాధికారం మరీ ఎక్కువమంది చేతుల్లో ఉంటుందని అంటుంటారుగానీ, వాస్తవానికి అక్కడ అధికార పరిధి పరిమితంగానే, సంబంధిత అంశంతో క్రియాశీల సంబంధమున్నవారి చేతుల్లో ఉంటుంది. అది కూడా అంతిమంగా రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛలకు లోబడే ఉంటుంది. వ్యవస్థలు, వికేంద్రీకరణ, జవాబుదారీతనంతో అక్కడ అధికారం ప్రజాస్వామ్యయుతంగా పనిచేస్తుంటుంది. అదే మనదేశంలో పరిస్థితి ఏమిటి? మన సువిశాలత్వం, భిన్నత్వంతో పోల్చి చూస్తే.. తుది నిర్ణయం తీసుకునేవారి సంఖ్య చాలా తక్కువగా కనిపిస్తుంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, అప్పుడప్పుడు జిల్లా మేజిస్ట్రేట్ లేదా సుప్రీంకోర్టు– వీళ్లే గదా భారత్‌లో నిర్ణయాలు తీసుకునేది! ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఇటువంటి కేంద్రీకృత పాలన ఉంటే.. వ్యవస్థ అనివార్యంగా పనికిమాలినదిగా తయారై చతికిలపడుతుంది.

పైన చెప్పుకున్న అపార్ట్‌మెంట్ నిర్వహణ దగ్గర్నుంచి భారతదేశంలో ప్రతి గొప్ప విజయం కూడా స్థానిక స్థాయిలో లేదా కొన్ని రంగాలలో చొరవ, నాయకత్వం, అధికారాల బదిలీ, జవాబుదారీతనం, వనరుల వికేంద్రీకరణతో సాధించినవే. 'ఇస్రో', కురియన్ నిర్మించిన శ్వేతవిప్లవం, హరిత విప్లవం, సమర్థ ఎన్నికల నిర్వహణ, విపత్తులలో సహాయక చర్యలు, వీఐపీల సందర్శనల వంటి ఈవెంట్ మేనేజ్‌మెంట్ల నిర్వహణ లేదా అక్కడక్కడా అద్భుతాలు సృష్టిస్తూ మార్గదర్శకుల్లా ఉండే గొప్ప ఆవిష్కర్తల, అధికారుల అత్యుత్తమ పనితీరు– అన్నీ కూడా అధికారాల బదిలీ, స్థానిక నాయకత్వం, అధికారాన్ని–జవాబుదారీ తనాన్ని మేళవించటం, సంబంధితుల్నందరినీ భాగస్వాముల్ని చేయటం వల్లే సాధ్యమయ్యాయి.




ప్రజాస్వామిక వికేంద్రీకరణ పట్ల మనం చాలాకాలంగా పైపై సానుభూతిని, మద్దతుని ప్రదర్శిస్తున్నాం. అందుకే అవి ఇంకా పూర్తిస్థాయి ఫలితాల్ని సాధించటంలేదు. ఫెడరల్ రాజకీయాల్లో మన రాష్ట్రాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా, స్వతంత్రంగా ఉన్నప్పటికీ.. అవసరమైన కీలక మార్పులకు అవకాశం మాత్రం రాష్ట్రాలకు ఇంకా లేదు. రాష్ట్రాల పాలనా వ్యవస్థ మొత్తాన్నీ రాజ్యాంగమే నిర్దేశిస్తుండటం ఇందుకు ప్రధాన కారణం. ఏ ఇతర ప్రజాస్వామ్య దేశంలోనూ ఫెడరల్ రాజ్యాంగం రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేత (ముఖ్యమంత్రి) లేదా శాసనసభ ఎన్నికల విధానాన్ని, పాలనా యంత్రాంగం నిర్మాణాన్ని లేదా స్థానిక ప్రభుత్వాల రాజ్యాంగాన్ని శాసించదు. స్థానిక ప్రభుత్వాలను పటిష్టంగా పాదుకొల్పేందుకు మనదేశంలో ప్రయత్నాలు మొక్కుబడిగా ఉండటంతో.. అవి అయ్యవార్ని చేయబోతే ఏదో అయినట్లయ్యాయి. (73, 74 రాజ్యాంగ సవరణలు) మితిమీరిన నిర్మాణంతో, అధికారాలు లేని బలహీన, ప్రభావశూన్యమైన స్థానిక ప్రభుత్వాల్ని తయారుచేశాయి. రాష్ట్రాల శాసనసభ సభ్యులు, సీనియర్ ఉన్నతాధికారులే స్థానిక ప్రభుత్వాలకు బద్ధశత్రువులుగా మారారు. తమ ఎదుగుదలకు స్థానిక ప్రభుత్వాలను శత్రువులుగా వాళ్లు భావించారు. రాజ్యాంగ హోదా ఉన్నప్పటికీ స్థానిక ప్రభుత్వాలకి కేంద్రం, రాష్ట్రాల నుంచి పన్నుల డబ్బు బదిలీలో గ్యారంటీ వాటా లేదు.. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు, అధికారుల తీరు పట్ల మనకేమీ రొమాంటిక్ అంచనాలు, అభిప్రాయాలు ఉండనక్కర్లేదు. అక్రమమైనా సంపాదించాలనే పేరాశ, ఓట్ల కొనుగోలు, అవినీతి, అసమర్థత ఇవన్నీ కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉన్నట్టే స్థానిక స్థాయిలో కూడా ఉంటాయి. అయినా అదే పరిష్కారం, అదే (ఒకే ఒక్క) సమాధానం– స్థానిక ప్రభుత్వాలకి నిజమైన సాధికారత కల్పించటం, తగినన్ని వనరుల్ని వికేంద్రీకరించటం, జవాబుదారీతనాన్ని అమలు చేయటానికి స్వతంత్ర ప్రతిపత్తి గల అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేయటం! అప్పుడు మాత్రమే పౌరులు తమ ఓటుకు విలువనిస్తారు, తప్పుల నుంచి నేర్చుకుంటారు, తప్పుడు నిర్ణయాలకు మూల్యం చెల్లిస్తారు, ప్రజాస్వామ్యంలో నిజమైన భాగస్వాములుగా పరిణతి చెందుతారు.

వికేంద్రీకరణ కేవలం స్థానిక ప్రభుత్వాలకే కాదు.. అది రాజ్యాంగ స్వేచ్ఛలు, భారతదేశ ఐక్యత, సమగ్రత పరిధిలో రాష్ట్రాలకు కూడా విస్తరించే వెసులుబాటు కలిగినటువంటిది. సహకార సంఘాల నుంచి స్కూల్స్ వరకు, స్థానిక హౌసింగ్ కాలనీల నుంచి స్వయం సహాయక బృందాల వరకు, నీటి వినియోగదారుల నుంచి ఆరోగ్య సంరక్షణ సంస్థల వరకు విస్తరించగలిగినది.

ఈవేళ మనందరికీ తెలుసు.. చాలామంది పౌరులు ప్రభుత్వం నుంచి తమకు హక్కుగా అందాల్సిన సేవలకు బలవంతంగా లంచం ఇస్తున్నారు. మనకు రోజువారీ తప్పనిసరిగా అందాల్సిన మంచినీరు, విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీ, మురుగుపారుదల, విద్య, ఆరోగ్యం వంటి సేవలన్నీ అధ్వాన్న స్థాయిలో, ద్వితీయశ్రేణి ప్రజలకు దయదలచి విదిలిస్తున్నట్టు వున్నాయి. మన పన్ను డబ్బుల్లో చాలా మొత్తాన్ని తమ స్వార్థం కోసం, పక్షపాత రాజకీయ అవసరాల కోసం పందేరం చేస్తున్నారు. ఎవరు ఎన్నికైనా, మన జీవితాల్లో మనందరం సగర్వంగా, ఆదర్శప్రాయంగా చెప్పుకోగలిగిన నిజమైన మార్పు మాత్రం ఉండదు. మంచి పాలన స్వయంపాలనకు ప్రత్యామ్నాయం కాదు కాబట్టే దేశం విడిచి వెళ్లాలని మన నాయకులు బ్రిటీషువాళ్లని అడిగారు. మరి ఈవేళ మన పోరాటం కేంద్రీకృత చెడ్డ ప్రభుత్వానికి – స్థానిక స్వయంపాలన ప్రభుత్వానికి మధ్యనే.

కేంద్రీకృత దుష్పరిపాలనా? స్థానిక స్వయంపాలనా? .. ఎంపికలో ఎవరికీ భిన్నాభిప్రాయం కూడా లేదు. ◈

# 'దామాషా పద్ధతి' ..

## ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటరీ కమిటీకి జేపీ బృందం నివేదిక

మనదేశంలో నల్లడబ్బు, అవినీతి, ఓట్ల కొనుగోలు, వంశపారంపర్య రాజకీయాలు, ఎన్నికల్లో తాయిలాలు, ప్రజల మధ్య చిచ్చు పెట్టే ధోరణులు పెచ్చరిల్లటానికి, చిన్న పనులకు కూడా ప్రజలు రాజకీయ నాయకుల మీద ఆధారపడటానికి, సేవాభావంగల సమర్థులు రాజకీయాలకు దూరమవటానికి మూలమైన ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనకు సంస్కరణలపై న్యూఢిల్లీలో పార్లమెంటరీ కమిటీతో మరోమారు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ సమావేశమయ్యారు. లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ తరపున నివేదిక అందచేశారు. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక సహా పలు ఎన్నికల సంస్కరణల కోసం లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నందున కమిటీ ఈ సమావేశానికి ఆహ్వానించింది. సురేంద్ర కుమార్ శ్రీవాస్తవ, అచ్యుతం కల్లాని, సిద్ధార్థ్ పన్వర్, వైభవ్ వర్మ తదితర నేతలు కూడా జేపీతో పాటు పాల్గన్నారు. వివిధ దేశాల అనుభవాలను బేరీజువేస్తూ భారతదేశ పరిస్థితులకనుగుణంగా లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ రూపొందించిన సంస్కరణల ప్రతిపాదనలను అందచేయటంతోపాటు వాటిపై కమిటీతో జేపీ బృందం చర్చించింది.

ఎన్నికల సంస్కరణలపై, ప్రధానంగా దామాషా పద్ధతి మీద పార్లమెంటరీ కమిటీకి జేపీ బృందం ఇచ్చిన కొన్ని ప్రతిపాదనలు..

1) ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ స్థానంలో భారత్‌కు దామాషా ఎన్నికల పద్ధతి మేలు: దేశంలో ఎన్నికల విరాళాలలో పారదర్శకత లోపించటానికి, నల్లడబ్బు పెరిగిపోవటానికి మూలం.. ఎన్నికలలో ఓట్ల కొనుగోలు! ఒక్క ఓటు ఎక్కువ వస్తే ఆ అభ్యర్థి మాత్రమే విజేత, మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే ప్రస్తుత ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల వ్యవస్థలో గెలుపునకు కీలకమైన కాసిన్ని అదనపు ఓట్ల వేట.. ఇప్పుడు మన పేదదేశంలో ఓట్ల కొనుగోలుకు మూలంగా ఉంది. ఎంత ఖర్చు చేసినా గెలుపు గ్యారంటీ ఉండదుగానీ, డబ్బు ఖర్చు చేయకపోతే ఆ అభ్యర్థి చాలా సందర్భాల్లో కనీస పోటీ కూడా ఇవ్వలేరు. దీనికి విరుగుడు దామాషా ఎన్నికల పద్ధతి (పి.ఆర్). దామాషా పద్ధతిలో ఓ పార్టీకి వచ్చిన ఓట్ల వాటాను బట్టి సీట్లను కేటాయించటం వల్ల, గెలుపు కోసం అదనపు ఓట్లు ఇక కీలకం అవ్వవు.

2) చాలా దేశాలు మార్చుకున్నాయి: పలు దేశాల్లో దామాషా ఎన్నికల పద్ధతి ఉంది. బ్రిటన్ కూడా కొంతమేర దామాషా పద్ధతికి మారినా.. మనదేశం సహా బ్రిటిష్ వలసదేశాల్లో ఇంకా పూర్తిగా ఎఫ్‌పిటిపి విధానమే కొనసాగుతోంది.

3) మనదేశానికి తగిన దామాషా నమూనా: అనేక కులాలు, మతాలు, ప్రాంతాలు, వైరుధ్యాలు ఉన్న మనదేశంలో దామాషా ఎన్నికల పద్ధతి వల్ల ఓట్లు చీలి అస్థిరత్వం ఏర్పడుతుందనే అభిప్రాయం ఉంది. దామాషా పద్ధతిలో రకరకాల నమూనాలున్నాయి. రాష్ట్రాల్లో ఓ పార్టీకి కనీసం 10శాతం ఓట్లు ప్రాతిపదికగా సీట్లు కేటాయించటం, లోక్‌సభకు రాష్ట్రం యూనిట్‌గా చేయటం, ప్రజాప్రతినిధులతో ప్రజలకు సంబంధం కొనసాగడానికి బహుళ సభ్యత్వ నియోజకవర్గాలను ఏర్పాటు చేయటం భారతదేశ పరిస్థితులకు అత్యుత్తమ నమూనా. దీనివల్ల చీలికలు, పేలికల్ని నివారించవచ్చు, ప్రతి ఓటుకూ విలువను తేవచ్చు. మెజారిటీ వచ్చిన పార్టీకి 10శాతం సీట్లను బోనస్‌గా ఇస్తే స్థిరత్వం ఏర్పడుతుంది.

4) ఓ సాధారణ చట్టం చాలు: ఇటువంటి పి.ఆర్ విధానాన్ని ప్రవేశపెట్టటం సాంకేతికంగా కూడా తేలిక. బహుళ సభ్యత్వ నియోజకవర్గాలకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది కాబట్టి ఈ ఎన్నికల ఏర్పాటుని పార్లమెంటులో ఒక సాధారణ చట్టం తెచ్చి అమలుచేసేయొచ్చు.

5) మనకు ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి: సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికలలో గెలిచి కొనసాగే పరిస్థితి ఉండి, విధానపరమైన పోటీతో పార్టీలు ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం అందిస్తూ గెలిచాక ప్రజల తీర్పుకనుగుణంగా వ్యవహరిస్తుంటే ఏ ఎన్నికల వ్యవస్థయినా ఫరవాలేదు. ఆ మౌలిక ప్రజాస్వామ్య సూత్రాలు లోపించాయి కాబట్టే.. మనదేశ పరిస్థితుల్లో దామాషా ఎన్నికల పద్ధతి, ఇతర ఎన్నికల సంస్కరణల్ని వేగంగా తేవటం అవసరం. ◈

# నీతి ఆయోగ్ పదిహేనేళ్ల వ్యూహం - మూడేళ్ల కార్యాచరణ

**చై**నా ఏకపార్టీ కమ్యూనిస్టు కేంద్రీకృత వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని భారత్‌లో ఏకపార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనలకనుగుణంగా నీతి ఆయోగ్ ఇటీవల 15 ఏళ్ల రోడ్‌మ్యాప్‌ని సూత్రప్రాయంగా ఆవిష్కరించింది. భారత్‌ను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దడానికి కావలసిన.. నాణ్యమైన పాఠశాల విద్య, ఆచరణసాధ్యంగా అందరికీ ఆరోగ్యం, రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తి, స్థానిక ప్రభుత్వాల సాధికారత, రైతుకి లాభసాటి ఆదాయం వంటి మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన అంశాలేవీ అందులో పెద్దగా కనిపించలేదు. మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు పరిమితమైనట్టు.. అక్షరాస్యత, వస్తు సౌకర్యాలు, భద్రత, పారదర్శకత, బీమా ఆధారిత ఆరోగ్య సేవలు వంటి అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. పాలసీలలో ఉన్న గ్యాప్‌లను స్థానిక అవసరాలకనుగుణంగా స్థానిక అధికారాలతో పూరించుకోవాలనే స్పష్టత ఇవ్వకుండా.. పరోక్షంగా కేంద్రానికి వెసులుబాటు కల్పించారు. ప్రాంతీయ వ్యూహాలంటూ మూడో అంచె ఫెడరలిజాన్ని సరిపెట్టేశారు.

పదిహేనేళ్ల వ్యూహపత్రంలో భాగంగా వచ్చే మూడేళ్లలో చేయాల్సిన అంశాలను కూడా నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగడియా ప్రస్తావించారు. ఈ వివరాలను రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కూడా అందచేశారు.

### చైనాయే పోటీ

2031-32 నాటికి భారత్ సౌభాగ్యవంతమైన దేశంగా మారాలంటే చైనాతో పోటీ పడాలని పనగడియా చెప్పారు. ఉన్నత విద్య, భద్రత, అవినీతి నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అపారమైన ఇంధన వనరులను సమకూర్చుకోవడంతోపాటు, పర్యావరణాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అప్పుడే ప్రపంచ దేశాలపై ప్రభావం చూపే శక్తి భారత్‌కు వస్తుందని చెప్పారు.

### ఐదు ప్రధాన లక్ష్యాలు

1) అన్ని ఇళ్లకూ మరుగుదొడ్లు, ఎల్‌పీజీ, విద్యుత్తు, డిజిటల్ సౌకర్యం.

2) ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనం లేదా కారు, ఎయిర్ కండీషనింగ్ సౌకర్యం. ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన జీవితానికి అవసరమైన వస్తువుల లభ్యత.

3) 100శాతం అక్షరాస్యత. అందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలు.

4) మరింత విస్తృతస్థాయిలో అత్యాధునిక రహదారులు, రైళ్లు, జల, వాయు మార్గాలను అందుబాటులోకి తేవడం.

5) పరిశుభ్రమైన గాలి, నీరు అందుబాటులోకి తెచ్చి స్వచ్ఛ నగరాలు, గ్రామాల రూపకల్పన

### ఇంకా చెప్పినవి..

- 2000-2015 మధ్యకాలంలో చైనా జీడీపీ రూ. 532లక్షల కోట్లు పెరిగి రూ. 710 లక్షల కోట్లకు చేరింది. ఇదేసమయంలో భారత్ జీడీపీ రూ. 46 లక్షల కోట్ల నుంచి రూ. 137 లక్షల కోట్లకు చేరింది. వచ్చే పదిహేనేళ్లలో రూ. 332 లక్షల కోట్ల మేర దీని సామర్థ్యాన్ని పెంచుకోవాలి. 2031-32 నాటికి జీడీపీ రూ. 469 లక్షల కోట్లకు చేరాలి.
- భారత్‌లో తలసరి జీడీపీ గత పదిహేనేళ్లలో రూ. 45,680 నుంచి రూ. 1,06,589కి చేరింది. 2031-32 నాటికి ఇది రూ. 3,14,667కి పెరగాలి.
- 2000 45.3కోట్ల మేర ఉన్న చైనా పట్టణ జనాభా 2015 నాటికి 76.3కోట్లకు చేరింది. 1991-2011 మధ్యకాలంలో భారత్ పట్టణ జనాభా 21.7కోట్ల నుంచి 37.7కోట్లకు పెరిగింది. 2031నాటికి ఇది 60కోట్లకు చేరాలి.
- 2015-16 నుంచి 2031-32 మధ్య కేంద్ర, రాష్ట్ర

## నీరు, విత్తనాలు, విద్యుత్ అవసరాలివి..

| | ప్రస్తుతం | 2022-23 నాటికి |
|---|---|---|
| నాణ్యమైన విత్తనాలు (మి.ట) | 3.03 (2014-15) | 7.97 |
| ఎరువులు (మి.ట) | 25.58 (2014-15) | 36.24 |
| సాగునీరు (మి.హె) | 92.58 (2012-13) | 110.40 |
| విద్యుత్ (మె.వా) | 47.78 (2012-13) | 307.39 |
| ఒకటికి మించిన పంటలు (శాతం) | 40.00 (2012-13) | 53.00 |
| పండ్లు, కూరగాయలు విస్తీర్ణం (మి.హె) | 16.75 (2013-14) | 26.38 |
| అధిక దిగబడులు ఇచ్చే ప్రాంతం (శాతం) | 69.3 (2014-15) | 90.00 |

మి.ట = మిలియన్ టన్నులు, మి.హె = మిలియన్ హెక్టార్లు, మె.వా = మెగావాట్లు

ప్రభుత్వాల వ్యయం రూ.92లక్షల కోట్ల మేర పెరగాలి. 2015-16లో రూ.38లక్షల కోట్లకు పరిమితమైన ఈ వ్యయం 2031-32నాటికి రూ.130లక్షల కోట్లకు పెరగాలి.

- ❒ మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతుల ఆదాయం రెట్టింపు చేయాలి. పరిశ్రమ, సేవల రంగంలో ఉన్నత వేతనశ్రేణి ఉద్యోగాలు సృష్టించాలి.
- ❒ పట్టణాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల రూపాంతీకరణ, ప్రాంతీయ వ్యూహాలను అమలుచేయాలి.

### రైతు ఆదాయం రెట్టింపునకు త్రిముఖ వ్యూహం

రైతుల ఆదాయం రెట్టింపు చేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్రిముఖ వ్యూహాన్ని అమలుచేయాలని నీతి ఆయోగ్ సూచించింది. అవి.. అభివృద్ధిపరమైన చర్యలు, సాంకేతికపరమైన మార్పులు, విధానపరమైన సంస్కరణలు. ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలివి..

- ❒ ప్రతి సంవత్సరం నాణ్యమైన విత్తనాల సరఫరాను 12.8శాతం, ఎరువులను 4.4శాతం, విద్యుత్ సరఫరాను 7.6శాతం మేర పెంచాలి.
- ❒ కొత్తగా 17.8 లక్షల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించాలి.
- ❒ ఏటా 18.5 లక్షల హెక్టార్ల చొప్పున రెండు పంటల సాగును పెంచుకుంటూ పోవాలి.
- ❒ పండ్లు, కూరగాయల సాగును 5శాతం పెంచాలి. ఆహారశుద్ధిని 3.6శాతం మేర పెంచుతూ పోవాలి.
- ❒ పంట కోతల్లో, రవాణాలో జరుగుతున్న నష్టాన్ని ఆధునిక మౌలిక వసతుల ద్వారా తగ్గించాలి.
- ❒ దేశంలో ప్రస్తుతం ఒక్కో గేదె సగటున 4.90 కిలోలు, ఆవు 3.1 కిలోలు పాలు ఇస్తున్నాయి. పాల దిగుబడి అధికమయ్యేలా చర్యలు చేపట్టాలి.
- ❒ పశువులకు నాణ్యమైన దాణా అందించాలి. కృత్రిమ గర్భధారణను పెంచాలి. ఈతల మధ్య అంతరాన్ని తగ్గించాలి.
- ❒ రైతులకు అత్యాధునిక యంత్రసామాగ్రిని అందుబాటులోకి తేవాలి.
- ❒ వివిధ సామాజిక, ఆర్థిక, జీవ భౌతిక పరిస్థితులకు తగిన వ్యవసాయ విధానాలను భారత వ్యవసాయ పరిశోధన సంస్థ అభివృద్ధి చేయాలి. అత్యుత్తమ సాగు విధానాలను పరిచయం చేయాలి.
- ❒ పంటకు గిట్టుబాటు ధర కల్పన, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు చేపట్టడం ద్వారా మూడోవంతు ఆదాయం పెంచడానికి వీలుంది.
- ❒ మార్కెటింగ్, భూమి లీజు విధానంలో సంస్కరణలు చేపట్టడం, ప్రైవేటు భూముల్లోనూ అటవీ ఉత్పత్తులను పెంచుకోవడానికి అనుమతివ్వడం.
- ❒ పెట్టుబడులు, ఆధునిక విజ్ఞానం కొరతలను అధిగమించడానికి ఉత్పత్తి, మార్కెటింగ్ రంగంలోకి బాధ్యతాయుతమైన ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలి.
- ❒ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చట్టంలో మార్పులు, మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర వచ్చేలా చూడాలి.

## ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులే గొప్ప భారతదేశాన్ని నిర్మించలేరు: నీతి ఆయోగ్ కార్యాచరణపై జేపీ



నరేంద్రమోదీ మూడేళ్ళ పాలనపై నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగడియా చేసిన సమీక్షలో ఆర్థికరంగానికి సంబంధించి కొన్ని సానుకూలాంశాలను నిజాయతీగా పేర్కొన్నప్పటికీ, దేశ ప్రగతికి పునాదిలాంటి విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేకుండా పౌరసేవలు, చట్టబద్ధ పాలన గురించి కనీసం ప్రస్తావన కూడా లేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా।। జేపీ విమర్శించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులే గొప్ప భారతదేశాన్ని నిర్మించలేరన్నారు. ఒక దేశం అభివృద్ధిని సాధించి గొప్పదిగా రూపుదిద్దుకోవాలంటే.. అందరికీ ఎదిగే అవకాశాలు, తలెత్తుకుని స్వతంత్రంగా బతికే ఏర్పాట్లు, సత్వర న్యాయం ముఖ్యమని.. కేవలం ఆర్థికవిధానాలు, నిజాయతీ అయిన కేబినెట్ సరిపోవని అన్నారు. అవినీతిపై పోరాటం చేస్తున్నామని చెబుతూ.. గతిలేక లంచం ఇచ్చే పౌరులపై కేసులు పెట్టేలా, అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యోగులను రక్షించేలా చట్టసవరణ తీసుకురావటం ఏం సబబని అన్నారు. రాజకీయ పార్టీలు నిజాయతీగా, సృజనాత్మకంగా ఆలోచించటం, సమీక్షించుకోవటం మానేసి, లక్ష్యంలేని అధికారాన్ని ఏదోకరకంగా సంపాదించుకోవటమే ధ్యేయంగా పనిచేస్తున్నాయని అన్నారు. ట్విట్టర్‌లో జేపీ చేసిన ఈ వ్యాఖ్యలపై అరవింద్ పనగడియా స్పందిస్తూ.. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన తన వ్యాసంలో కేవలం 850 పదాలు మాత్రమే ఉన్నాయని, నీతి ఆయోగ్ మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికను చూడాలని సూచించారు.

అరవింద్ వ్యాఖ్యలకు జేపీ ప్రతిస్పందిస్తూ.. నీతి యాక్షన్ ప్లాన్‌ని బ్రౌజ్ చేశానని, గొప్ప మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు కనిపించాయిగానీ సరైన వ్యవస్థలు, సానుకూల ప్రోత్సాహకాలు, వాటికి వనరుల కేటాయింపు కొరవడిందని అన్నారు. నీతి ఆయోగ్ కార్యాచరణపై కూడా ప్రభుత్వం మందకొడిగానే వ్యవహరిస్తోందన్నారు. వ్యవస్థలు లేకుండా ప్రజలకు సరైన సేవల్ని, జీవితాల్ని అందించలేమన్నారు. ఆర్థిక విధానం, లావాదేవీలు, మౌలికవసతులను దాటి వ్యవస్థీకృత సంస్కరణల కోసం ప్రభుత్వం కనీసం ఆలోచిస్తున్న దాఖలాలు అగుపించటం లేదన్నారు. నీతి ఆయోగ్ ప్రయత్నాల పట్ల తనకు గౌరవం ఉందని, కానీ విద్య, ఆరోగ్యంలో ఫలితాలు అధ్వాన్నంగా ఉంటే, రైతుకు న్యాయమైన ఆదాయం-వ్యవసాయేతర రంగాలలో భారీగా ఉపాధి అవకాశాలతో గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాల తగ్గింపు, సరైన వ్యవస్థల దిశగా ప్రోత్సాహకాలు, వనరుల కేటాయింపు లేకుంటే గొప్ప భారతదేశాన్ని ఎలా నిర్మిస్తారు? అని జేపీ ప్రశ్నించారు.

- పంటల మద్దతు ధర విధానం పంటల మార్పిడి సాగు నమూనాను దెబ్బతీసింది. దీన్ని అదుపు చేసేందుకు ధరల కొరత చెల్లింపు విధానం (ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్-పీడీపీ) అమలు చేయాలి. మద్దతు ధరల విధానాన్ని అమలుచేస్తూనే.. పీడీపీలో భాగంగా నిర్దిష్ట పంటలపై రైతులకు సరైన ధర రానప్పుడు ఆ నష్టాన్ని భర్తీచేయాలి. దీన్ని నేరుగా రైతులకు అందచేయాలి.
- సాగునీటి రంగంలాంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వ కేటాయింపుల కంటే అధికంగా రాష్ట్రాలు ఖర్చు చేయాలి.
- మార్కెటింగ్, భూమి లీజు విధానాల్లో వేగంగా సంస్కరణలు తీసుకురావాలి.
- వ్యవసాయాదాయంపై ఒక పరిధి దాటాక పన్ను విధించాలని నీతి ఆయోగ్ సభ్యుడు బిబేక్ డెబ్రాయ్ అన్నప్పటికీ అధికారికంగా ఆ అంశాన్ని ప్రచురించలేదు.

### జమిలి ఎన్నికలు

గత మూడు దశాబ్దాలలో అటు లోక్‌సభ, ఇటు శాసనసభలకు ఎన్నికలు జరగని సంవత్సరం ఒక్కటి కూడా లేదు. సరాసరిన ఏడాదికి ఐదు నుంచి ఏడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. ఫలితంగా వ్యయం భారంగా మారింది. ఎన్నికల నియమావళి పాలన, అభివృద్ధి పనులపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. భద్రతా దళాలు ఈ పనులలోనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తోంది. ఇలాంటి అనేక సమస్యలకు లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి జమిలి ఎన్నికలు నిర్వహించటమే పరిష్కారమని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది.

17వ లోక్‌సభ నుంచే దీన్ని అమలుచేయాలని సూచించింది.

- మొదట రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించడం ద్వారా దీనిని అధిగమించవచ్చని పేర్కొంది.
- లోక్‌సభకు, 14 రాష్ట్రాల అసెంబ్లీలకు 2019 ఏప్రిల్‌-మే మధ్య ఎన్నికలు నిర్వహించాలి. మిగిలిన రాష్ట్రాలకు 2021 అక్టోబర్‌-నవంబర్‌ మధ్య నిర్వహించాలి. ఇది పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన సిఫార్సుకు తగ్గట్టుగా ఉంది. దీనికి ఒకసారి అసెంబ్లీల గడువు పొడగించడం లేదా తగ్గించడం చేయాల్సి ఉంటుంది. ఇందుకు రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయి.
- ముందస్తుగా అసెంబ్లీ లేదా లోక్‌సభను రద్దు చేయాల్సి వస్తే రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయని నీతి ఆయోగ్‌ పేర్కొంది.

ప్రస్తుతం స్వీడన్‌, దక్షిణాఫ్రికాలో జమిలి ఎన్నికలు జరుగుతున్నాయి.

**అవినీతిపై విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు**

ప్రజాస్వామ్యంపై నమ్మకం పోయేలా చేస్తున్న అవినీతి కేసుల విచారణను వేగవంతం చేయాలని నీతి ఆయోగ్‌ సూచించింది. విజిలెన్స్‌ కేసుల విచారణ పూర్తికావడానికి సగటున ఎనిమిదేళ్ళ పడుతోందని, సమయం వృథా కాకుండా నిబంధనల్లో మార్పులు తేవాలని సిఫార్సు చేసింది. పెండింగ్‌ కేసులను తగ్గించడానికి, నిజాయతీపరుల్లో విశ్వాసాన్ని పెంచడానికి భారీ సంస్కరణలు తేవడంతోపాటు.. అవినీతి కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని (లోక్‌సత్తా ఈ ప్రతిపాదనను చాలా ఏళ్లుగా చేస్తున్న విషయం తెలిసిందే. పార్లమెంటరీ కమిటీల ముందు కూడా పలు సందర్భాల్లో జేపీ ఈ అంశాన్ని వివరించారు), నిర్దిష్ట గడువులోగా విచారణ పూర్తిచేసేలా నిబంధనలు విధించాలని పేర్కొంది. అలాగే సివిల్‌ సర్వీసుల అధికారుల విధులు, బాధ్యతలు, పదోన్నతులు, అధికారస్వామ్యం (బ్యూరోక్రసీ) తదితర అంశాలపైనా నీతి ఆయోగ్‌ సూచనలు చేసింది. సివిల్‌ సర్వీసు అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకొని అమలుచేసేలా సాధికారత కల్పించాలని సూచించింది. బాగా పనిచేసినవారిని ప్రోత్సహిస్తూ, పనిచేయనివారిని మందలించాలని అభిప్రాయపడింది. ◈

# జులై నాటికి 30వేల ఓటు రసీదు యంత్రాలు




ఓటు నమోదైనట్టు ధృవీకరిస్తూ రసీదును వెలువరించే వీవీ పాట్‌ (ఓటర్‌ వెరిఫైబుల్‌ పేపర్‌ ఆడిట్‌ ట్రైల్‌) యంత్రాలను వేగంగా సమకూర్చుకోవటానికి కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. జులైనాటికల్లా మరో 30వేల యంత్రాలను సమీకరించనుంది. ప్రస్తుతం ఈసీ వద్ద ఇలాంటి యంత్రాలు 53,500 ఉన్నాయి. కొద్దిరోజుల్లో గుజరాత్‌, హిమాచల్‌ప్రదేశ్‌లలో జరగబోతున్న శాసనసభ ఎన్నికలను పూర్తిగా ఇలాంటి యంత్రాలతో నిర్వహించాలంటే మరో 30వేల వరకు అవసరమవుతాయి. ఈ రెండు రాష్ట్రాల్లో అన్ని పోలింగ్‌ కేంద్రాల్లోనూ వీవీ పాట్‌లను ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. గుజరాత్‌ శాసనసభ పదవీకాలం వచ్చే జనవరి 22న, హిమాచల్‌ప్రదేశ్‌ అసెంబ్లీ పదవీకాలం అదే నెల 7న ముగిసిపోనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ఈ డిసెంబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశముంది. వీవీ పాట్‌ యంత్రాల కొనుగోలుకు రూ.3700కోట్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఒక్కో యంత్రానికి రూ.19,650 చొప్పున 16.15లక్షల వీవీ పాట్‌ల కొనుగోలు చేయాలని ఈసీ భావిస్తోంది. ప్రభుత్వరంగ సంస్థలైన ఈసీఐఎల్‌, బీఈఎల్‌లు వీటిని సరఫరా చేస్తాయి. ఇప్పుడు ఆర్డర్‌ ఇస్తే 2018 సెప్టెంబర్‌కల్లా ఇవి సమకూరతాయి. ఆ తర్వాత ప్రతి ఎన్నికలో వీవీ పాట్‌లనే వాడాలని నిర్ణయించారు. ◈

# మోదీ కేబినెట్‌లో స్థాయిలేని మంత్రులు



ప్రధాని నరేంద్ర మోదీ 'సంస్థాగత నిర్మాత' పరీక్ష నెగ్గాల్సి ఉందని రచయిత ఉదయ్ మహూర్కర్ అభిప్రాయ పడ్డారు. జాతి నిర్మాత అనిపించుకునే స్థాయికి మోదీ ఎదగడానికి ఈ పరీక్షలో విజయం ఎంతో కీలకమన్నారు. 'మార్చింగ్ విత్ ఎ బిలియన్: అనలైజింగ్ నరేంద్రమోదీస్ గవర్నమెంట్ ఎట్ మిడ్‌టర్మ్' అనే తన పుస్తకంలో రచయిత మోదీ సారథ్యంలోని మూడేళ్ల పరిపాలనపై లోటుపాట్లపైన విశ్లేషించే ప్రయత్నం చేశారు. మోదీ పనితీరును ప్రశంసిస్తూనే ఆయన పాలనపై తీర్పును వెలువరించేందుకు మూడేళ్ల పాలన స్వల్ప వ్యవధి అని అభిప్రాయపడ్డారు. మోదీ మంత్రివర్గంలో పలువురు చక్కటి సామర్థ్యాన్ని కనబరుస్తున్నప్పటికీ.. మంత్రుల్లో తగు స్థాయిగలవారు తగినంతమంది లేరన్నారు. మోదీ, ఆయన కేబినెట్ నిజాయతీగా ఉన్నప్పటికీ పనితీరు పేలవంగా ఉందని, ఎన్నికల విజయాలు, ప్రతిపక్షాల వైపల్యంతో నిషాతో కూడిన నిస్తేజం ప్రభుత్వాన్ని, బీజేపీని ఆవరించిందని.. మూడేళ్ల పాలనపై కొందరు సుప్రసిద్ధ విశ్లేషకులు చేస్తున్న వాదనను పుస్తకం పూర్తిగా తోసిపుచ్చ లేదు. మూడేళ్ల పాలన స్వల్ప సమయమే అయినా, మోదీని గెలిపించటం వెనక ప్రజల మనసుల్లో ఉన్న ఆకాంక్షల్ని నెరవేర్చే దిశగా కనీసం అడుగులు పడటం లేదని ఈ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత యూపీయే ప్రభుత్వ విధానాలకు కాస్త రంగులద్ది కొనసాగించటం తప్ప మోదీ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదన్నారు. "మూడేళ్ల పాలన తర్వాత మోదీ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదు. మంత్రుల్లో అధికార ఆడంబరంతో కూడిన ఉదాసీనత, ఆధిపత్యధోరణులు ఆవరించాయి" అని పలువురు మంత్రులతో మాట్లాడిన అనంతరం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కాలమిస్టొకరు అభిప్రాయపడ్డారు. బీజేపీవారిలో పలువురు అధికారానికి కొత్త కావటంతో.. మైమరిచిపోయి హోదాలను ఆస్వాదిస్తున్నారని, ప్రజల సొమ్ముతో జమిందారులు, సామంతరాజుల్ని తలదన్నేలా విశాలమైన బంగళాల్లో విలాసవంతమైన జీవితాల్ని గడుపుతున్నారని ఆమె అన్నారు. మోదీ ప్రభుత్వంలోని అధికార నిషా అలసత్వం, ప్రతిపక్ష వైఫల్యం దేశంలో మార్పునకు పెద్ద అవరోధంగా మారాయన్నారు. వ్యక్తిగతంగా నిజాయతీపరుడైన ప్రధాని, మంత్రివర్గం మాత్రమే ఈ దేశానికి చాలవని, వ్యవస్థీకృత నిజాయతీతో క్రియాశీలంగా వ్యవహరిస్తూ సంస్కరణలు తెచ్చే నాయకత్వాన్ని ప్రదర్శించటం ఇప్పుడు అవసరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కూడా సోషల్ మీడియా ద్వారా మోదీకి పదేపదే తెలియచెబుతున్న సంగతి తెలిసిందే.

# అన్ని రాష్ట్రాలదీ రుణమాఫీ బాటే?

రుణమాఫీ వంటి పథకాల వల్ల రైతులకు, ఇతర వర్గాల ప్రజలకు ఉపయోగం ఉండదని 2014 ఎన్నికల్లో చెప్పి, ఆ తర్వాత సరైన అవగాహన లేకుండా అమలు చేసిన డీమానిటైజేషన్ (పెద్దనోట్ల రద్దు) లెక్క తప్పటంతో ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో మాట మార్చిన నరేంద్ర మోదీ బాటలోనే 2019 ఎన్నికల్లో అన్ని రాష్ట్రాలూ పయనించే అవకాశముందంటున్నారు. రాబోయే ఎన్నికల్లో దాదాపు అన్ని రాష్ట్రాలూ రుణమాఫీలను ప్రకటిస్తాయని, వీటి విలువ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో 2శాతం వరకు ఉంటుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ అంచనా వేసింది. యూపీ బాటలో మహారాష్ట్ర, కర్ణాటక కూడా ఇప్పటికే రుణమాఫీ ప్రకటించిన సంగతి తెలిసిందే. మొత్తం 40 బిలియన్ డాలర్ల (రూ.2.57లక్షల కోట్లు) మేర బ్యాంకు రుణాలను రద్దు చేస్తారని మెరిల్ లించ్ లెక్క. దీని ప్రభావం మార్కెట్‌పై పడకుండా ఉండేందుకు ఆర్థికశాఖ ప్రత్యేకంగా బాండ్లు జారీ చేసే అవకాశముందని తెలిపింది. ఈ అంకె ఇంకా ఎక్కువగా రూ.3లక్షల కోట్ల (జీడీపీలో 2.6శాతం) దాకా ఉంటుందని ఇండియా స్పెండ్ అంచనా.

# రాష్ట్రపతి పీఠం దిశగా రామ్‌నాథ్ కోవింద్

భారత నూతన రాష్ట్రపతిగా కాంగ్రెస్ కూటమి అభ్యర్థి మీరాకుమార్‌పై బీజేపీ కూటమి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్ గెలుపు లాంఛనప్రాయమేనని భావిస్తున్నారు. జులై–ఆగస్టులో జరిగే పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో ప్రథమ పౌరుడి ఎన్నిక కూడా ఓ ప్రధానాంశం కానుంది.

◈

# గ్రేట్ ఇండియన్ బ్యాంక్ రాబరీ - రికవరీ/రైటాఫ్..

## మొండి బకాయిలపై అదనపు అధికారాలతో చర్యలు ప్రారంభించిన ఆర్‌బీఐ



భారత ఆర్థికరంగానికి పెనుభారంగా మారిన రూ. 6-10లక్షల కోట్ల మొండిబకాయిల (ఎన్‌పీఏ)ను వసూలు చేయటానికి/ పరిష్కరించటానికి వీలుగా కేంద్రం ఇటీవల కట్టబెట్టిన చట్టబద్ధ అధికారాలతో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చర్యలు ప్రారంభించింది. విజయ్ మాల్యాతోపాటు.. మొండిబకాయిల్లో దాదాపు 25శాతం మేర ఉన్న 12 కంపెనీల మీద దివాలా అస్త్రాన్ని ప్రయోగించింది. 'నిర్ణీత గడువు'లోగా చర్యలకు బ్యాంకులను ఆదేశించింది.

### ఆర్థికసర్వే పరిష్కారం - పారా

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసిన ఆర్థికసర్వే సూచనను చూస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండిబకాయిల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీ (పబ్లిక్ సెక్టార్ రీహాబిలిటేషన్ ఏజెన్సీ-పారా) ఏర్పాటు చేయాలని అభిప్రాయపడింది. దాదాపు 13 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కనీసం 40శాతం రుణాలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని, ఇందులో 20శాతం మొండి బకాయిలుగా ఉన్నాయని సర్వే వివరించింది. ఎన్‌పీఏలు కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లకు కూడా సవాళ్లు విసురుతున్నాయని, అటు బ్యాంకింగ్, ఇటు కార్పొరేట్ ద్వంద్వ బ్యాలెన్స్ షీట్లు (టీబీఎస్) సమస్యకూ పారానే పరిష్కారం చూపగలదని భావిస్తున్నట్టు సర్వే తెలిపింది.

### పార్లమెంటు సమావేశాల్లో చట్టసవరణ బిల్లు

బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949లోని సెక్షన్ 35కి సవరణలతో ఎన్‌పీఏల పరిష్కారానికి కేంద్రం ఈ అధికారాలను ఆర్‌బీఐకి కట్టబెట్టింది. ఇందుకోసం ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టింది (దీనికి అనుబంధంగా.. బ్యాంకులు, బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలు సంక్షోభ సమయాల్లో కట్టుతప్పి ప్రజాధనాన్ని యధేచ్ఛగా దుర్వినియోగం చేయకుండా నిరోధించేందుకు ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు-2017కు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది). ఈ ఆర్డినెన్స్‌తో "రుణ ఎగవేతదారుల విషయంలో 'ఇన్‌సాల్వెన్సీ అండ్ బాంక్రప్టసీ కోడ్ 2016' నిబంధనల కింద దివాళా పరిష్కార చర్యలు చేపట్టాలని ఏ బ్యాంకునైనా ఆర్‌బీఐ ఆదేశించగలదు." అసాధారణ స్థాయికి చేరిన ఎన్‌పీఏల సమస్య పరిష్కారానికి బ్యాంకులకు సూచనలిచ్చేందుకు ఒకటికి మించిన యంత్రాంగాలను ఏర్పాటు చేసే అధికారం ఆర్‌బీఐకి ఉంటుంది. ఈ ఆర్డినెన్స్ స్థానంలో చట్టసవరణ బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెడుతుంది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలో కొత్తగా సెక్షన్ 35 ఏఏ, 35 ఏబీలకు చోటు కల్పించనుంది.

**ఈ చట్టసవరణ వల్ల..**

❒ భారీ రుణ ఎగవేతదారుల విషయంలో మరిన్ని చర్యలకు ఆర్‌బీఐకి అవకాశం లభించింది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు తాజా రుణాలు ఇక లభించడం కష్టమే. వారిపై నిషేధం విధించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరవచ్చు. రుణ ఎగవేతదారులను కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్లుగా నియమించుకోవడం కూడా ఇకపై కుదరదు.

### ఎవరూ బాధ్యతగా వ్యవహరించలేదు!

ఎవరూ బాధ్యతగా వ్యవహరించ లేదు. అందుకే బ్యాంకుల నిరర్థక ఆస్తులు నాలుగంటే నాలుగేళ్లలో ఏడు రెట్లు పెరిగాయి. 2009లో ఉన్న రూ. 44,957కోట్ల ఎన్‌పీఏలు లక్షల కోట్లకు చేరుకున్నాయంటే దానికి బ్యాంకుల పనితీరే కారణం. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, పెర్ల్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ వంటివి ఉదాహరణలు మాత్రమే. ఎగవేతదారుల మీద బ్యాంకులు, సెబీ ఎక్కడలేని మెతకవైఖరిని చూపాయి. అవకతవకలు దృష్టికి వచ్చినా పట్టించుకోరు. సీబీఐకి ఫిర్యాదు చేయరు. మాకు మేముగా కేసులు నమోదు చేయవలసి వస్తున్నది. అంతా ముగిశాక ఫిర్యాదు చేయడం అంటే అది డిఫాల్టర్లు సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి, నిధులు దారి మళ్లించడానికి అవకాశం ఇవ్వడమే. నిరర్థక ఆస్తుల గుర్తింపు ప్రక్రియ సుదీర్ఘంగా ఉంది. డిఫాల్టర్లు నిధులు తరలించి తప్పించుకుంటున్నారు. సామాన్యుడు నిబంధనల మేరకు పైసా పైసా కక్కుతుంటే, డబ్బున్నవాళ్లు, పలుకుబడి కలిగినవారు తేలిగ్గా రుణాలు ఎగవేసి దర్జాగా తిరుగుతున్నారనే సందేశం ప్రజల్లోకి వెళ్తోంది.

**- సీబీఐ మాజీ డైరెక్టర్ అనిల్ కుమార్ సిన్హా**

❒ రంగాలవారీగా పర్యవేక్షణ కమిటీలను నియమించే అధికారం ఆర్‌బీఐకి ఇచ్చారు. ఒత్తిడిలో ఉన్న రుణాల వసూలుకు పరిష్కారాలు సూచించేందుకు కమిటీలు లేదా

## తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి

భారీగా బ్యాంకుల రుణాల ఎగవేతలో తెలుగు రాష్ట్రాలను చూస్తే.. దేశ ముఖచిత్రానికి భిన్నంగా ఏమీ లేదు. దేశవ్యాప్తంగా అత్యధిక ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు రుణాలిచ్చిన ఘనత సాధించిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆరు, ఐదు స్థానాలలో ఉన్నాయి. ఇక ఎగవేతదారులకు కోటికిపైగా రుణమిచ్చి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రాష్ట్రాల జాబితాలో కూడా మన రెండు రాష్ట్రాలు టాప్ టెన్‌లో ఉన్నాయి. విద్యార్థులను సైతం రుణాల విషయంలో ముప్పతిప్పలు పెడుతున్న బ్యాంకులు.. ఎగ్గొట్టే సంపన్నులకు మాత్రం ఉదారంగా ఇస్తున్నాయి. నిబంధనల మేరకు ఐదు లక్షల వరకు విద్యారుణాలకు గ్యారంటీ అడగకూడదు. కానీ అనేక బ్యాంకులు విద్యారుణాలంటేనే ముఖం చాటేస్తున్నాయి.

## ఉద్దేశపూర్వక ఎగవేతలు లేని రుణాలు అందరికీ అందాలి: జేపీ

“ఆర్థికవ్యవస్థ పెరగటానికి రుణాలివ్వటాన్ని ప్రోత్సహించాల్సిందే. ఒక్కోసారి అనుకోని అవరోధాలతో మాంద్యం ఏర్పడి నిజాయతీపరులు కూడా మొండి బకాయిల సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చు. అటువంటి వారిని నిరుత్సాహపరిస్తే, ఆర్థికరంగం పెరగదు. కాబట్టి.. రైతు రుణమాఫీల దగ్గర్నుంచి పారిశ్రామిక రాయితీల వరకు లోతైన అధ్యయనం చేయాలి. ఉద్దేశపూర్వక ఎగవేతలు లేని రుణసౌకర్యాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చే వ్యవస్థని నిర్మించాలి. ఉత్పాదకతను, జనాల ఆదాయాన్ని పెంచటం రుణాల ప్రధాన లక్ష్యం కావాలి”

**– లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్**

అధికారులను కూడా నియమించగలదు.

❐ మొండి బకాయిల సమస్య పరిష్కారానికి బ్యాంకర్లు తీసుకునే నిర్ణయాల విషయంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ, కాగ్, ఈడీ తదితర దర్యాప్తు సంస్థల నుంచి బ్యాంకర్లకు కొత్త చట్టం రక్షణ కల్పిస్తోంది. దర్యాప్తు సంస్థల విచారణ భయాలతో బ్యాంకర్లు.. ఎన్‌పీఏల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. తాజా ఆర్డినెన్స్‌తో ఆ భయాలు తొలగుతాయి.

❐ ఒత్తిడిలో ఉన్న రుణాల విషయమై పరిష్కారానికిగాను ఆర్‌బీఐ సమయానుకూలంగా మార్గదర్శకాలు జారీ చేయగలదు. దివాళా పరిష్కారచర్యలు చేపట్టాలని బ్యాంకులను ఆదేశించగలదు.

❐ మొండి బకాయిల ఖాతాల విషయంలో పరిష్కారచర్యలు




చేపట్టేందుకు బ్యాంకులకు మరింత నియంత్రణ లభిస్తుంది.

❐ హెయిర్‌కట్ (ఇచ్చిన రుణంలో బ్యాంకు నష్టపోయేందుకు అంగీకరించే మొత్తం) విషయంలో కేసును బట్టి పరిష్కారం సూచించే అధికారం ఆర్‌బీఐకి లభించింది. అవసరమైతే మార్గదర్శకాల్లోనూ వెసులుబాటు ఇవ్వగలదు.

❐ కొత్త చట్టంతో రుణ ఎగవేతదారులను కంపెనీల యాజమాన్యం, ఓటింగ్ హక్కుల నుంచి తప్పుకోవాలని బ్యాంకులు ఆదేశించగలవు. వారి స్థానంలో కొత్త యాజమాన్యాన్ని ఏర్పాటు చేసి నిర్దేశిత కాలంలోగా పునరుద్ధరణ బాట పట్టించే చర్యలు చేపట్టచ్చు.

❐ ఆర్‌బీఐ తొలుత 50 భారీ రుణ ఎగవేత కేసులను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పరిష్కరించటంపై దృష్టి సారించనున్నట్టు సమాచారం.

కాగా, ఆర్‌బీఐ జోక్యం పెంచటం పట్ల భిన్నాభిప్రాయాలున్నా.. ఎన్‌పీఏల పరిష్కారం చాలా సమయం తీసుకునేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ జోక్యంతోపాటు, ఉద్యోగులకు మితిమీరిన రక్షణ కల్పించేలా అవినీతి నిరోధక చట్టానికి సవరణ వంటి అంశాల్ని కూడా విస్మరించలేమంటున్నారు. ◈

## ఆర్‌బీఐకి తెలియకుండా జరిగే అవకాశం లేదు

బ్యాంకు అధికారులు, రాజకీయ నాయకులతో పాటు రిజర్వుబ్యాంకు పాత్ర కూడా మొండి బకాయిలలో ఉందని కొందరు నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎన్‌పీఏలతో సతమతమవుతున్న పలు బ్యాంకుల అధికారులతో సమావేశాలు జరిపిన అనంతరం వారు ఈ విషయాన్ని వెల్లడించారు. కీలక నిర్ణయాలు తీసుకునే బ్యాంకు బోర్డులో ఆర్‌బీఐ ప్రతినిధి కూడా ఉంటారని, ఆ ప్రతినిధులకు కూడా తెలిసే పెద్దమొత్తంలో రుణాలు అందించారని వారన్నారు.

చర్చలతో ఏకాభిప్రాయ సాధన, ఫెడరలిజం స్ఫూర్తికి అద్దం పడుతూ చట్టసభల్లో ఆమోదం పొందిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం దేశవ్యాప్త ఏకీకృత పన్ను విధానంగా (అవసరంలేని అట్టహాసంతో) భారత్‌లో జులై 1 నుంచి అమలులోకి వచ్చింది. కేంద్ర, రాష్ట్రాల పరిధిలో ఉన్న 17 రకాల పన్నులను తొలగించి వాటిస్థానంలో 122వ రాజ్యాంగ సవరణతో జీఎస్టీని అమలు చేస్తున్నారు. సెస్సుతో కలిపి జీఎస్టీ




# ఇక జీఎస్టీ జమానా ... సెప్టెంబర్ నుంచి పూర్తిస్థాయిలో

గరిష్టంగా 43శాతం ఉంటుంది. స్లాబుల్లోనూ, ఇతరత్రా కూడా తప్పనిసరి అనుకున్న మార్పులు చేర్పులను పరిగణలోకి తీసుకుంటూ సెప్టెంబర్ నుంచి ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుంది. ఈ పన్ను, రిటర్నులు అన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటాయి. జీఎస్టీ డేటాబేస్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాదారులుగా జీఎస్టీ నెట్‌వర్క్ ఏర్పాటైంది. దానిలో కేంద్రానికి 24.5శాతం, ఢిల్లీ సహా రాష్ట్రాలకు 24.5శాతం కలిపి 49శాతం వాటా ఉంది. మిగతా 51శాతం వాటా వివిధ ఆర్థిక సంస్థల చేతుల్లో ఉంది. కాంపోజిషన్ స్కీం పరిధి తగ్గింపు వంటి అంశాలతో ప్రత్యేక హోదా ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు కొంత మినహాయింపు ఇచ్చారు.

ప్రపంచవ్యాప్తంగా జీఎస్టీని అమలు చేసిన తొలి దేశం ఫ్రాన్స్ (1954). ఇప్పటివరకూ దాదాపు 140 దేశాల్లో అమల్లో ఉంది. మనదేశం అమల్లోకి తెస్తున్న ద్వంద్వ జీఎస్టీ విధానం కెనడా వంటి దేశాల్లో ఉంది.

మనదేశ జీఎస్టీలో మూడు రకాలున్నాయి. **1) సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ):** కేంద్ర పరిధిలోని సెంట్రల్ ఎక్సయిజ్, అడిషనల్ ఎక్సయిజ్ డ్యూటీ, కస్టమ్స్, సర్వీస్ ట్యాక్స్, సర్‌ఛార్జీ, కౌంటర్ వీలింగ్ డ్యూటీ ఇందులో ఉంటాయి **2) స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ):** రాష్ట్ర పరిధిలోని వ్యాట్, అమ్మకం పన్ను, లగ్జరీ ట్యాక్స్, కొనుగోలు పన్ను, వినోదపు పన్ను, స్థానిక పన్ను, అంతర్రాష్ట్ర పన్ను, లాటరీ, బెట్టింగులపై విధించే పన్నులు **3) ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ):** ఏదైనా ఉత్పత్తులు, లావాదేవీలు రెండు రాష్ట్రాల్లోని సంస్థల మధ్య జరిగిన పక్షంలో ఐజీఎస్టీ చెల్లించాలి. ఇక్కడ ఒకేరకమైన పన్ను ఉంటుంది. అది కూడా నేరుగా కేంద్రం ఖాతాలోకి వెళ్తుంది. దిగుమతి చేసుకునే ఉత్పత్తులు, సేవలపై పన్ను కూడా ఐజీఎస్టీ పరిధిలోకే వస్తాయి.

ఆల్కాహాల్, పెట్రోలియం ఉత్పత్తులతోపాటు విద్యుత్‌ను జీఎస్టీ పరిధిలో చేర్చలేదు. ఈ క్రమంలో బేసిక్ కస్టమ్ డ్యూటీ (బీసీడీ), ఎగుమతి పన్ను, రోడ్డు మరియు ప్యాసింజర్ పన్ను, టోల్ ట్యాక్స్, ఆస్తి పన్ను, స్టాంప్, రిజిస్ట్రేషన్ ట్యాక్స్, ఎలక్ట్రిసిటీ పన్ను, మద్యంపై పన్ను, స్థానిక ప్రభుత్వాల ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌లను జీఎస్టీలో కలపలేదు.

జీఎస్టీలో ఆహారధాన్యాలు సహా ప్రధాన నిత్యావసరాలపై పన్ను తగ్గించటంతో సామాన్య, మధ్యతరగతి వారు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు (ఒక్కో కుటుంబానికి రూ.500 వరకు ఆదా అవుతుందని అంచనా) కొంత ఎక్కువ మేలు జరిగే అవకాశమున్నప్పటికీ.. స్థూలంగా ఈ పన్ను పద్ధతి వల్ల దీర్ఘకాలంలో అన్ని రాష్ట్రాలకూ ప్రయోజనాలు పెరుగుతాయనే నమ్ముతున్నారు.

**వస్తువులపై.. జీఎస్టీ పన్ను శాతం - ప్రధాన శ్లాబుల్లో (0, 5, 12, 18, 28శాతం)**

0శాతం శ్లాబు: ప్యాకేజింగ్ లేని బియ్యం, గోధుమలు, ఇతర ఆహార ధాన్యాలతోపాటు పాలు, పెరుగు, కోడిగుడ్లు, లస్సీ పన్ను మినహాయింపు విభాగంలోకి వస్తాయి. ఇప్పటివరకూ కొన్ని రాష్ట్రాలు వీటిపై 'వ్యాట్' వసూలు చేస్తున్నాయి. బెల్లం, ప్యాక్ చేయని పన్నీర్, వప్పుదినుసులు, అన్‌బ్రాండెడ్ సహజసిద్ధమైన తేనె, తాజా కూరగాయలు, పండ్లు, గోధుమపిండి, మైదాపిండి, సెనగపిండిలకు కూడా మినహాయింపు వర్తిస్తుంది. ప్రసాదాలు, సాధారణ ఉప్పు, గర్భనిరోధక సాధనాలు, బ్రెడ్, సింధూరం, స్టాంపులు, న్యాయపత్రాలు, ముద్రిత పుస్తకాలు, గాజులు, చేనేత ఉత్పత్తులు, సిల్కు, జనుము, జాతీయ జెండా, గాంధీ టోపీ, ఖాదీ దారం, కంపెనీ బ్రాండు లేని తేనె, పిల్లల డ్రాయింగ్, కలర్ పుస్తకాలు, పేదలకు ఉచితంగా పంపిణీ చేయడానికి విదేశీ సంస్థలు ఏదైనా ధార్మిక సంస్థకు విరాళంగా ఇచ్చిన ఆహారపదార్థాలు, మందులు, వస్త్రాలు, దుప్పట్లు పైనా పన్ను లేదు.

(బంగారం, వజ్రాలు వెండిపై 3శాతం, సానబెట్టని వజ్రాలపై 0.25శాతం జీఎస్టీ ఉంటుంది).

5శాతం: మిఠాయిలపై 5శాతం పన్ను వేశారు. పంచదార, టీ, కాఫీ (ఇన్‌స్టంట్ కాఫీ మినహా), వంటనూనెలు పై ఈ శ్లాబు పన్ను ఉంటుంది. వీటిపై ప్రస్తుతం కూడా దాదాపు ఇంతే పన్ను ఉంది. ప్రాణాధార మందులపై 5శాతం పన్నే ఉంటుంది. బొగ్గుపై పన్నును 11.69శాతం నుంచి 5శాతానికి తగ్గించారు. పాలపొడి, పాల ఆహారపదార్థాలు, ప్యాకింగ్ చేసిన పన్నీర్, గృహావసరాల గ్యాస్ సిలిండర్లు, పత్తి, అన్ని రకాల సహజసిద్ధ దారాలు, నూలు, అగ్గిపెట్టెలు, ప్యాకెట్లలో ఉన్న సేంద్రియ ఎరువులు, జీడిపప్పు, రూ.500లోపు పాదరక్షలు, కొబ్బరిపీచు మ్యాట్లు, వెయ్యిలోపు ఖరీదైన చీరలు, సౌరఫలకాలపైనా ఈ శ్లాబ్ పన్నే ఉంటుంది.

❒ బట్టర్, నెయ్యి, ప్యాకింగ్ చేసిన కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు, మొబైల్ ఫోన్లు, బాదం, సాస్‌లు, మిక్సర్లు, ఆయుర్వేద ఔషధాలు, టూత్‌పౌడర్లు, కుట్టుమిషన్లు, వెయ్యికంటే ఖరీదైన వస్త్రాలు, గొడుగులు, రెడీమేడ్ దుస్తులు వగైరాలపై 12శాతం పన్ను ఉంటుంది.

❒ నిత్యం ఉపయోగించే తలనూనెలు, సబ్బులు, టూత్‌పేస్టులుపై పన్నును 18శాతానికి పరిమితం చేశారు. వీటిపై ఇప్పుడు 22-24శాతం వరకు ఉంది. కృత్రిమ దారాలు, నూలు, తునికాకు, బిస్కట్లు, స్కూలు బ్యాగులు, కంప్యూటర్లు, ప్రింటర్లు, బాత్‌రూంలో వినియోగించే వస్తువులు, రూ.100లోపు సినిమా టికెట్లు, రూ.500 కన్నా ఖరీదైన పాదరక్షలుపైనా 18శాతం విధించారు.

❒ ప్రొటీన్ డ్రింకులు, పాన్‌మసాలా, చూయింగ్ గమ్, కార్లు, వెండింగ్ మెషీన్లు, బీడీలు వగైరాలపై 28శాతం పన్ను వసూలు చేస్తారు. ఏసీలు, ఫ్రిజ్‌లపైనా 28 శాతం పన్ను.

ఇలా మొత్తంగా 1200 పైచిలుకు వస్తువులలో దాదాపు 7శాతానికి ఎలాంటి పన్ను లేదు. 14శాతం వస్తువులకు 5శాతం పన్ను ఉంది. 17శాతం వస్తువులు 12శాతం పన్ను శ్లాబ్‌లో ఉన్నాయి. 43శాతం వస్తువులకు 18శాతం పన్ను శ్రేణి వర్తిస్తుంది.

**సేవలపై..**

మొత్తం 500 రకాల సేవల్లో 83 సేవలకు పన్ను మినహాయింపు ఇచ్చారు. పన్ను మినహాయింపు కొనసాగించిన విద్య, ఆరోగ్యం సేవలు కూడా ఇందులో ఉన్నాయి. నాన్ ఏసీ ప్రయాణాలు, మెట్రో, లోకల్ రైళ్లు, హజ్ వంటి మతపరమైన యాత్రలు, రోజుకు వెయ్యి రూపాయలు ఛార్జి చేసే హోటళ్లు, లాడ్జీలు తదితరాలు ఈ జీరో శ్లాబ్‌లో ఉన్నాయి. పశువైద్యశాలలు, పుణ్యక్షేత్రాల యాత్రలు, రిజర్వుబ్యాంకు సేవలు, ధార్మిక సంస్థలు, దౌత్య కార్యాలయాల సేవలు, విద్యుత్ సరఫరా, పంపిణీ, కబేళాలు, టోల్ ఆపరేటర్ల సేవలు, నివాసం కోసం అద్దెకు ఇచ్చే ఇళ్లు, బ్యాంకు డిపాజిట్లు, రుణాలు, సామాన్యస్థాయి న్యాయసేవలు, ప్రజాగ్రంథాలయాలు, పుస్తక ప్రచురణ, కూరగాయలు, పళ్లను చిల్లర అమ్మకం కోసం ప్యాకింగ్ చేయటం వంటి సేవలు కూడా పన్ను మినహాయింపు పొందాయి.

❒ ఎకానమీ క్లాస్ విమానయానం, రవాణా, ఓలా, ఉబెర్ వంటి క్యాబ్ సర్వీసులు తదితర 13 రకాల సేవలు 5శాతం పన్ను పరిధిలో ఉంటాయి.

❒ నాన్‌ఏసీ రెస్టారెంట్లలో ఆహారంపై బిల్లులు, నిర్మాణరంగ కాంట్రాక్టు పనులు, రోజుకు వెయ్యి నుంచి రెండు వేల మధ్య టారిఫ్ ఉన్న హోటళ్లు వగైరాలకు 12శాతం పన్ను.

❒ టెలికాం, ఆర్థిక సేవలు, ఏసీ రెస్టారెంట్లు, మద్యం అమ్మేందుకు లైసెన్సు ఉన్న బార్ అండ్ రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లలో రెస్టారెంట్లు, 2,500 నుంచి 7,500 రూపాయల వరకు టారిఫ్ ఉన్న హోటళ్లు, లాడ్జీలు తదితర సేవలకు 18శాతం జీఎస్టీ.

❒ బిజినెస్ క్లాస్ విమాన ప్రయాణం, రూ.7500 మించిన హోటల్ బిల్లులు, సినిమాలు, క్యాసినోలు, రేస్‌కోర్సులు 28 శాతం పన్ను కట్టాలి.

**పన్నుకు 'అదనం'**

❒ కార్లను 28శాతం పన్ను రేటులో ఉంచగా.. నాలుగు మీటర్ల పొడవు కంటే తక్కువ ఉండే చిన్నకార్లు, 1200సీసీ పెట్రోల్ ఇంజిన్ కెపాసిటీ కార్లపై 1శాతం సెస్సు, చిన్న డీజిల్ కార్లు, 1500సీసీ కంటే తక్కువ ఇంజిన్ కార్లపై 3శాతం సెస్సు విధిస్తారు. మధ్యతరహా కార్లు, ఎస్‌యూవీ, ఖరీదైన కార్లపై 15శాతం సెస్సు. 1500సీసీ ఇంజిన్ కెపాసిటీ ఉన్న విలాసవంతమైన కార్లపై 15శాతం సెస్సు.

❒ నిమ్మరసం, ఎరేటెడ్ డ్రింక్స్‌పై 28శాతం పన్నుతోపాటు 12శాతం సెస్సు.

❒ 350సీసీ ఇంజిన్ కెపాసిటీ ఉన్న మోటారుసైకిళ్లపై 28శాతం పన్నుతోపాటు 3శాతం సెస్సు అదనం. ప్రైవేటు ఎయిర్‌క్రాఫ్ట్, ఖరీదైన పడవలపైనా అదే పన్ను రేటు.

❒ పొగాకు, పొగాకు ఉత్పత్తులపై 28శాతం పన్నుతోపాటు 61 నుంచి 204శాతం వరకు సెస్సు విధిస్తారు. ఇక పైప్స్, సిగరెట్స్ కోసం వాడే పొగాకు పదార్థాలపై 290 శాతం పన్ను. 65 ఎంఎం పొడవు మించని ఫిల్టర్, నాన్‌ఫిల్టర్ సిగరెట్లపై 5శాతం సెస్సు. ఒక్కోదానిపై రూ. 1.59 అదనం. 65 ఎంఎం నుంచి 70 ఎంఎం పొడవు మించని నాన్‌ఫిల్టర్ సిగరెట్లపై 5శాతం సెస్సు, రూ. 2.87 అదనం, ఫిల్టర్ సిగరెట్లపై 5శాతం సెస్సు, రూ. 2.12 అదనం, బ్రాండెడ్ గుట్కాలపై 72శాతం సెస్సు (వీటిని 28శాతం పన్ను జాబితాలో చేర్చారు). ◈

# సాంస్కృతిక దిగ్గజం సినారె




దాదాపు 60 ఏళ్లపాటు తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి సంకేతంగా సి.నారాయణరెడ్డి నిలిచారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అంజలి ఘటించారు. సినారె రచనలు, ప్రయోగాలు అందరినీ అలరించాయన్నారు. హైదరాబాద్‌లోని నారాయణరెడ్డి స్వగృహంలో భౌతికకాయానికి జేపీ నివాళులర్పించారు. రచనల్లో, జీవితంలో ప్రతికూల భావాలు లేకుండా అజాత శత్రువులా సంపూర్ణమైన, లక్ష్యంతో కూడిన జీవితాన్ని సినారె గడిపారని ప్రస్తుతించారు. తన ఆలోచనల్ని పంచేందుకు సభల్లో పాల్గొనడాన్ని ఆనవాయితీగా పాటించారన్నారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ రామ్ దేశ్‌పాండే కూడా నారాయణరెడ్డికి ఘననివాళులర్పించారు. లోక్‌సత్తా పార్టీ కార్యక్రమంలో సినారె పాల్గొన్న ఫోటోని సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు.

# మిగలినవన్నీ వదిలేసి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయండి

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బండారు నాగరాజు డిమాండ్ చేశారు. జీవో 42 ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అమలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు చూడనట్టు వ్యవహరిస్తున్నారని, అధికారుల లంచాల కోసమే విద్యాహక్కు చట్టం వచ్చినట్టుందని అన్నారు. కేసీఆర్ మిగతా పనులన్నిటినీ ఇతరులకు అప్పచెప్పి.. 'అందరికీ నాణ్యమైన విద్య అందించేలా' విద్యావ్యవస్థ ప్రక్షాళన చేయటం మీదే దృష్టి పెడితే బంగారు తెలంగాణ గ్యారంటీగా వస్తుందన్నారు. స్కూల్స్ విడిచే సాయంత్రం 4 నుంచి 5 గంటలప్పుడు సూర్యాపేట ప్రాంతంలో వాహనాల వేగాన్ని 25 కిలోమీటర్ల కన్నా తక్కువ ఉండేలా నియంత్రించి ప్రమాదాలను నివారించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్, విద్యార్థిసత్తా నాయకులు విజ్ఞప్తి చేశారు. ◈

# కరీంనగర్ ఉద్యమాల చుక్కాని చుక్కారెడ్డి

*నవత చుక్కారెడ్డిగా తన పత్రిక పేరుతో కరీంనగర్ జనహృదయాల్లో నిలిచిపోయిన కోమటిరెడ్డి చుక్కారెడ్డి మృతి పట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అజరామరమైన లోక్‌సత్తా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన ఉద్యమ, పాత్రికేయ నేపథ్యాన్ని, నైపుణ్యాలను చుక్కారెడ్డి వినియోగించారని, అలాంటి వారి స్ఫూర్తితో యువత పెద్దసంఖ్యలో సామాజిక రాజకీయం చేయాలన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. చుక్కారెడ్డికి నివాళిగా సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ రాసిన వ్యాసం లోక్‌సత్తా టైమ్స్ పాఠకుల కోసం..*



జనధర్మ ఆచార్య, జీవగడ్డ (విద్యుల్లత) విజయ్ కుమార్, కేకలు రామదాస్, మంటలు ప్రభాకర్ అదే కోవలోకి వొచ్చే పత్రికా సంపాదకుడు నవత చుక్కారెడ్డి. సన్నిహిత మిత్రుడు, పాత్రికేయుడు, సంఘసేవకుడు నవత చుక్కారెడ్డి (72) జూన్ 22, 2017 ఉదయం హైదరాబాద్‌లోని ఒక ఆస్పత్రిలో మరణించారన్న వార్త విన్నాక ఇది రాయాలనిపించింది. పైన పేర్కొన్న వాళ్లెవరి ఇంటి పేర్లూ అవి కావు. వాళ్లు నడిపిన పత్రికల పేర్లే వాళ్ల ఇంటి పేర్లుగా స్థిరపడిపోయాయి. తెలంగాణ జిల్లాల్లో ఆయా సమయాల్లో అక్కడి సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన పత్రికలు జనధర్మ, జీవగడ్డ, కేకలు, మంటలు, నవత. వీళ్లంతా తెలంగాణ జిల్లాల్లో చాలాకాలమో, కొంతకాలమో, స్వతంత్రంగా, నిర్భయంగా, అద్భుతంగా స్థానిక వార్తాపత్రికలు నడిపినవాళ్లు.

కోమటిరెడ్డి చుక్కారెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వెలగటూర్ మండలం చేగ్యాం గ్రామస్తుడు. వ్యవసాయ భూములు బాగానే ఉన్న మోతుబరి రైతు కుటుంబంలో జన్మించినా విద్యార్థి దశ నుంచే రచనా వ్యాసంగం పట్ల విపరీతమైన ఆసక్తి. కాలేజీ రోజుల్లోనే ఆయన కథలు ప్రముఖ మాసపత్రిక యువలో చాలా అచ్చయ్యాయి.

1978లో నవత పక్షపత్రిక ప్రారంభించాక ఆయన ఇంటి పేరు, ఊరి పేరు అందరూ మరచిపోయారు. నవత చుక్కారెడ్డిగా కరీంనగర్ జన హృదయాల్లో నిలిచిపోయాడు. 1990 దాకా చుక్కారెడ్డి సంపాదకత్వంలో వెలువడిన నవత పక్షపత్రిక ప్రజల సమస్యలకు, ఉద్యమాలకు ఊపిరిగా ఉండేది. నవత పత్రిక సంపాదకత్వం ద్వారా మాత్రమే కాకుండా ఆయన కరీంనగర్‌లో జరిగిన ప్రతి ప్రజాఉద్యమంలో భాగస్వామి అయ్యేవాడు. కరీంనగర్ ఫిలిం సొసైటీ నుంచి మొదలుకుని లోక్‌సత్తా ఉద్యమ నిర్మాణం దాకా చుక్కారెడ్డి భాగస్వామ్యంలేని పౌర ఉద్యమాలు గత నాలుగు దశాబ్దాలలో కరీంనగర్ జిల్లాలో మనకు కనిపించవు. ఇంగ్లిష్, తెలుగు భాషలలో ఆయన చదవని పుస్తకం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రేమాస్పదుడు, వివాదరహితుడు నవత చుక్కారెడ్డి మరణం తెలంగాణ సామాజిక ఉద్యమాలకు తీరని లోటు.

చుక్కారెడ్డి మరణంతో తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసి దివిటీలయి దారి చూపి ముందుకు నడిపించిన ఈ పత్రికల జ్ఞాపకాలను పదిలపరిచే ఆలోచన తెలంగాణ ప్రభుత్వం చేస్తే బాగుండునని అనిపిస్తున్నది. చిన్న పత్రికల చరిత్ర చిరస్మరణీయం చెయ్యడం ద్వారానే చుక్కారెడ్డి వంటి పలువురు అన్‌సంగ్ ఎడిటర్లు (గుర్తింపు రాని సంపాదకుల) జ్ఞాపకాలను పదిలపరచుకోగలుగుతాం. ఆప్తమిత్రుడు చుక్కారెడ్డికి నివాళి. ◈

## ప్రభుత్వ బడుల్ని బలోపేతం చేయాలి

బడుల్ని మూసివేయటంలో చూపుతున్న ఉత్సాహాన్ని ప్రభుత్వం స్కూలు విద్యను బలోపేతం చేయటంలో చూపటం లేదని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణ సమున్నతస్థాయికి ఎదగాలంటే ప్రభుత్వ బడుల్ని పటిష్టం చేయాలన్నారు. ప్రతి బిడ్డకీ ఉచితంగా నాణ్యమైన చదువును అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల జీతాల చుట్టూకాకుండా విద్యార్థుల చదువు చుట్టూ నిధుల కేటాయింపు ఉండాలని సూర్యాపేటలో జరిగిన సమావేశంలో అన్నారు. సైదులు, కిరణ్, భరత్, ప్రదీప్, జయరాం తదితరులు పాల్గొన్నారు. ◈

# పరిశ్రమల పేరుతో రియల్‌ఎస్టేట్ దోపిడీ

## - లోక్‌సత్తాలో చేరిన రైతులు -





విజయనగరం జిల్లాలో పరిశ్రమల పేరుతో భూదోపిడీని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీకి భూములిచ్చి మోసపోయిన రైతులతో ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కె.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గన్నారు. 1990లో కేసీపీ సిమెంట్ ప్లాంట్ నిర్మాణానికి 40 ఎకరాల భూమిని సేకరించారని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశపడిన గ్రామస్తులు ఎకరా భూమి రూ.10వేలకే అప్పచెప్పారని అన్నారు. ఆ తర్వాత కర్మాగారం ఏర్పాటు చేయకుండా మరోవ్యక్తికి భూమిని కేసీపీ యాజమాన్యం అమ్మేసిందన్నారు. పరిశ్రమ ఏర్పాటు కావాల్సిన భూమిలో ప్రస్తుతం నీలగిరి మొక్కలు సాగుచేస్తున్నారన్నారు. ఇదే తరహాలో జిందాల్ అల్యూమినియం కర్మాగారం చేస్తున్న మోసాన్ని కూడా లోక్‌సత్తాయే బైటికిలాగిందని, ఆ సంస్థ నుంచి కూడా భూముల్ని రైతులకు ఇప్పించేందుకు పోరాడుతున్నామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకుంటే భూముల్ని తక్షణం ప్రజలకు అప్పచెప్పాలన్నారు. తప్పుడు కేసులకు భయపడేది లేదన్నారు. తొలకరి వచ్చినా పేపర్లలో ప్రకటనలు తప్ప రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు, ఇతరత్రా పెట్టుబడి సౌకర్యాలు లేవన్నారు. రైతులకు, యువతకు అన్ని రకాలుగా లోక్‌సత్తా అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కర్రి వెంకట నాగేశ్వరరావు, బోజంకి గోవిందరావు ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో రైతులు లోక్‌సత్తా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. వారికి కండువా కప్పి బాబ్జీ ఆహ్వానించారు. ప్రజలే ప్రభువులుగా ఉండి పాలకులకు సేవకుల్లా ఉండాలని, కానీ ప్రస్తుతం దానికి వ్యతిరేకమైన రాజకీయం నడుస్తోందని, ప్రతివ్యక్తీ నాయకుల్లా ఎదగాలంటే లోక్‌సత్తా పార్టీలో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుడు ఆదాడ మోహనరావు, లోక్‌సత్తా నాయకులు దొడ్డ నాగార్జున, పద్మాకర్, మాజీ సర్పంచ్ రాములమ్మ, మిడతాన అప్పారావు, రాజారావు, శిమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తర్వాత రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ◈

# చంద్రబాబు అండ్ కో సిగ్గుపడాలి





ప్రభుత్వ పాఠశాలలను నడుపుతున్న తీరుకు చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు సిగ్గుపడాలని బాబ్జీ అన్నారు. విజయనగరంలోని మునిసిపల్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులనడిగి వివరాలు తెలుసుకున్నారు. మౌలిక వసతులు లేవని, పనికొచ్చే చదువు కోసం ప్రయత్నం లేదని అన్నారు. సర్కారీ బడుల్లో పేద, బలహీనవర్గాల పిల్లలే ఎక్కువగా ఉన్నారని, తల్లిదండ్రులకు అక్షరజ్ఞానం లేకపోవటంతో మంచి చదువు కోసం డిమాండ్ కూడా చేయలేకపోతున్నారన్నారు. జిల్లాలో ఉన్న 2,927 స్కూళ్లలో దాదాపు 80శాతానికి మౌలిక సదుపాయాలు లేవన్నారు. లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, శిమ్మ శ్రీను, భీంపల్లి భాస్కర్, శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు. ◈

# విశాఖ భూకుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలి

విశాఖ నగరం, జిల్లాలో బైటపడుతున్న భూకుంభకోణాలు కనీవినీ ఎరుగనివని, వీటిని మంత్రులు గంటా శ్రీనివాసరావు, అయ్యన్న పాత్రుడుల మధ్య వివాదంగా చిత్రీకరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల్ని పక్కదోవ పట్టిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. నష్టపోయినవారంతా బడుగుబలహీనవర్గాలు, పేదలేనన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతల ప్రమేయమున్నందున వీటిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హైకోర్టయినా సుమోటాగా తీసుకోవాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు ఎంఎస్ఎన్ మూర్తి, వేణుగోపాల్, హరిగణేష్, గౌరి, శంకర్, శ్రీను, సాంబశివరావు తదితరులతో కలసి విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో విచ్చలవిడి డబ్బును వెదజల్లే రాజకీయానికి దేశంలోనే నాంది పలికిన చంద్రబాబు నాయుడు.. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రిగా అధికారాన్నంతా కేంద్రీకరించుకుని రాష్ట్ర వనరుల్ని యధేచ్ఛగా దోచుకునే రాజకీయాన్ని సాగిస్తున్నారని, ముదపాక, పెందుర్తి తదితర ప్రాంతాల్లో రైతులతో కలిసి భూకబ్జాలను బైటికి తెచ్చింది లోక్‌సత్తాయేనని బాబ్జీ గుర్తుచేశారు. హుద్‌హుద్ తుపాను సమయంలోనే భూములు రికార్డులు గల్లంతయ్యాయని చెబుతున్నారని, ఆ సమయంలో కలెక్టర్, మునిసిపల్ కమిషనర్, ఇతర అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు చేయాల్సిన పనులన్నీ తానే చేసి అదో ఘనకార్యంలా ఆనాడు చెప్పుకున్న చంద్రబాబే ఇందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. రికార్డుల గల్లంతు కట్టుకథలైనా, వాస్తవాలైనా ముఖ్యమంత్రే సమాధానం చెప్పాల్సుంటుందన్నారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, తెలుగుదేశం గత హయాం నుంచీ విశాఖలో భూకుంభకోణాలు జరుగుతున్నాయని, గతంలో భూ బకాసురులుగా పేరుమోసిన నేతలే విశాఖలో తాజా వైట్‌కాలర్ కుంభకోణాలు చూసి బిత్తరపోతున్నారన్నారు. ఆ భూ బకాసురుల చేత కూడా నీతులు చెప్పించుకోవాల్సిన దుస్థితికి చంద్రబాబు ప్రభుత్వం వచ్చిందన్నారు. ఆక్రమణదారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించటంతోపాటు వెంటనే భూముల రికార్డులను నవీకరించి యజమానికి టైటిల్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రిటిష్‌వారు మనకంటే మెరుగ్గా భూముల రికార్డులను నిర్వహించారన్నారు. రెవెన్యూమంత్రి కె. ఈ కృష్ణమూర్తి, తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న గంటా రాజీనామా చేయాలన్నారు. చంద్రబాబు డబ్బు రాజకీయాల్ని, అవినీతిపై ప్రజల్లోనే విచారిస్తామనే డ్రామాలను ఆపి అవినీతిపై కఠిన చర్యలకు పౌర సేవల చట్టం సహా బలమైన ఏర్పాట్లు చేయాలని, దోషుల అవినీతి సొమ్మునే కాకుండా మొత్తం ఆస్తుల్నీ జప్తు చేయాలని డిమాండ్ చేశారు. అధికార, పబ్లిసిటీ పిచ్చి నుంచి



బైటపడి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలన్నారు. స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను జవాబుదారీ చేసేలా అధికార వికేంద్రీకరణ చేస్తే ప్రజలకు పాలనా విషయాలు బాగా అర్థమవుతాయన్నారు. భూ ఆక్రమణలు – పరిష్కారాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, ఈ క్రమంలో అన్ని పార్టీలతో కలసి పనిచేస్తామన్నారు. ఇటీవల 'విశాఖ భూ కుంభకోణాలు – దోషులపై చర్యలు – భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు'పై నగరంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో, 'సేవ్ విశాఖ' కార్యక్రమంలో చేసిన తీర్మానాలననుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన, ప్రజలను సమీకరించటం, జాతీయస్థాయిలో, న్యాయస్థానాల్లో పోరాటం చేయటానికి లోక్‌సత్తా తన వంతు సహకారాన్ని అందిస్తుందన్నారు.

### సేవ్ విశాఖలో బాధితుల గోడు.. రౌండ్‌టేబుల్‌లో విస్తృత చర్చ

సీబీఐ విచారణ జరిపిస్తేనే వాస్తవాలు బైటికొస్తాయని సేవ్ విశాఖ కార్యక్రమంలో వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. పలువురు బాధితులు, రైతులు ప్రభుత్వం అండతో జరుగుతున్న దోపిడీ, రాత్రికి రాత్రి అక్రమణలపై ఈ సందర్భంగా తమ గోడు వెళ్లబోసుకున్నారు.

అంతకుముందు.. విశాఖ భూ కుంభకోణాలపై వైకాపా ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్‌లో లోక్‌సత్తా, కాంగ్రెస్, జనసేన, సీపీఎం, సీపీఐ, బీఎస్పీల నేతలతోపాటు పలు ప్రజాసంఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు. భూ కబ్జాలు, రికార్డుల ట్యాంపరింగ్‌పై సీబీఐతో విచారణ జరిపితేనే దోషులు, వారి వెనకనున్నవారు బైటపడతారని వైకాపా రాష్ట్ర కార్యదర్శి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. ట్రిబ్యునల్స్‌తో బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆ పార్టీ సీనియర్ నేత బత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ముదపాక భూముల వ్యవహారంలో కలెక్టర్ స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించారని, పోలీసు కేసులు కూడా నమోదయ్యాయని, అయినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో వ్యవస్థలపై నమ్మకం పోతోందని అన్నారు. దసపల్లా భూముల విషయంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా కోర్టు ఎక్స్‌పార్టీ డిక్రీ ఇచ్చినందున తాము ఏమీ చేయలేకపోతున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత

# లక్ష ఎకరాల రికార్డులు మాయం



విశాఖపట్నం జిల్లాలో ఉన్న మొత్తం ఉన్న భూములు దాదాపు ఐదు లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు దాదాపు లక్ష ఎకరాలకు సంబంధించిన రికార్డులు మాయమైనట్టు చెబుతున్నారు. వీటిలో దాదాపు రూ.20వేల కోట్ల విలువైన భూములు ఇప్పటికే కబ్జాకు గురైనట్టు సమాచారం. కనీసం నాలుగువేల ఎకరాలను హాంఫట్ చేసినట్టు అంచనా వేస్తున్నారు. రికార్డుల నిర్వహణతో భూములను సంరక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే అక్రమార్కులకు కొమ్ముకాస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా ఇటీవల భూదందాలు విచ్చలవిడిగా జరిగాయి. విశాఖ పరిసరాలు అభివృద్ధి కేంద్రాలుగా మారడంతో రెవెన్యూ–భూ మాఫియా ఆగడాలు పెచ్చరిల్లిపోయాయి. దీనికితోడు భూముల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో నకిలీలతో భూములకు రక్షణ కరవైంది. సమాచార హక్కునీ అడ్డం పెట్టుకుని దొంగ పత్రాలను సృష్టించి సివిల్ వివాదాలతో లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. విశాఖ జిల్లాలో మొత్తం 43 మండలాలుండగా, గ్రామాలు 3,022 ఉన్నాయి. తీర, అటవీ ప్రాంతాలను మినహాయించి సర్వే నెంబర్లు 2,45,896 ఉన్నాయి. వీటిలో ఎఫ్ఎంబీలు (ఫీల్డు మేనేజ్మెంట్ బుక్స్– సర్వే సిబ్బంది రూపొందించే భూ వివరాల పటాలు) ఉన్న సర్వే నెంబర్లు 2,29.896. గల్లంతైనవి 16.375. గల్లంతైన ఎఫ్ఎంబీలు ఎకరాల్లో 1,06,239.9. అత్యంత విలువైన భూములున్న విశాఖ అర్బన్, గ్రామీణ, గాజువాక, పద్మనాభం, భీమునిపట్నం, ఆనందపురం, పెందుర్తి, పరవాడ, సబ్బవరం, పెదగంట్యాడ, అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, నర్సీపట్నం, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఎఫ్ఎంబీలు భారీగా గల్లంతయ్యాయి. విశాఖ జిల్లాలో ఈనాం భూములు ఎక్కువ. విజయనగరం రాజులు ఇచ్చిన ఈనాం భూములు అధికంగా ఉండటంతో రెవెన్యూ రికార్డుల్లో పలురకాల గందరగోళాలు నెలకొన్నాయి. ఈనాం ఇచ్చిన భూములకు సరైన దస్తావేజులు లేకపోవడంతో 1970లలో సెటిల్మెంట్లు చేసి 'ఫెయిర్ అడంగళ్లు' (ఎస్ఎఫ్ఏ–ఫెయిర్ సెటిల్మెంట్ అడంగళ్లు) రూపొందించారు. ఇవి కూడా లక్షల్లో గల్లంతయ్యాయి. దాదాపు 2,95,044 ఎస్ఎఫ్ఏ కాపీలు గల్లంతైన పరదేశిపాలెం, మధురవాడ, కొమ్మాది, పోతినమల్లయ్యపాలెం, ఎండాడ, రుషికొండ, ముడసర్లోవ, చినగదిలి, బక్కన్నపాలెం ప్రాంతాల్లో ఎకరా ధర రూ.25కోట్లకు పైనే ఉంది.

ఈ వాస్తవాలన్నిటితోపాటు.. రికార్డులు గల్లంతయ్యాయని హుద్‌హుద్ తుపాను సమయంలోనే చెప్పకపోవటం, పలువురు తాసీల్దార్ల వద్ద పదుల కోట్ల డబ్బు పట్టుబడటం, మంత్రి, చంద్రబాబు కుమారుడు లోకేష్ వచ్చాక కలెక్టర్ మాటమార్చారన్న సమాచారం, గీతం కాలేజీ పేరుతో తెదేపా సీనియర్ నేత ఎంవీవీఎస్ మూర్తి భూ దందాలు, భూ సమీకరణ (ల్యాండ్‌పూలింగ్)ను దుర్వినియోగం చేస్తున్నారని గంటా శ్రీనివాసరావు, ఆయన బంధుగణం, కొందరు ప్రజాప్రతినిధులపై ఆరోపణలు, బత్స, ధర్మాన సహా కొందరు ప్రతిపక్ష నేతల పాత్ర కూడా ఉందన్న వార్తలకు కూడా ప్రాథమిక ఆధారాలు కనిపిస్తుండటం జిల్లాలో భూముల చుట్టూ ఎంత భారీ కుంభకోణం జరిగిందో చెప్పకనే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక విచారణ కమిటీ (సిట్)తో విచారణ జరిపిస్తామని (కాల్‌మనీ కేసును ఇలాగే నీరుగార్చారు) ముఖ్యమంత్రి ప్రకటించినా ప్రజల్లో విశ్వాసం కలగటం లేదు.

పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేసిందని, ఈ నిర్ణయమే భూ కుంభకోణాలకు ఆజ్యం పోసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు అన్నారు. విశాఖలో భూ కుంభకోణాలకు ఎవరూ సాహసించకుండా ప్రజాఉద్యమాన్ని నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఏజే స్టాలిన్ సూచించారు. ప్రొఫెసర్ సూరప్పుడు మాట్లాడుతూ, విశాఖలో దోపిడీ వలస నాయకుల హవా పెరగడమే ప్రస్తుత దుస్థితికి కారణమన్నారు. కలెక్టర్‌పైనే ఆరోపణలు ఉన్నందున ఆయన్ను విచారణాధికారిగా నియమించడం వల్ల దోషులను పట్టుకునే అవకాశం ఉండదని బార్ అసోసియేషన్ సభ్యుడు రాజు అభిప్రాయపడ్డారు. భూ కబ్జాలపై అన్ని పార్టీలూ కలసి పోరాటం చేయాలని జనసేన సభ్యుడు పీవీఎన్ రాజు అన్నారు. విశాఖ ప్రభుత్వ భూముల్లో 90శాతం ఇప్పటికే కబ్జాకు గురయ్యాయని బీఎస్పీ నేత రాము అన్నారు. విశ్రాంత తహసీల్దార్ నర్సింహారావు మాట్లాడుతూ, భూకబ్జాలను అడ్డుకునేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసేలా పోరాటం చేయాలని సూచించారు. బాధితులకు పూర్తి అండగా ఉండటంతోపాటు, కీలకాంశాలలో హేతుబద్ధ ఉమ్మడి కార్యాచరణకు కట్టుబడి పార్టీలు పనిచేస్తుంటే.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరమైన భూకబ్జాలు, ఇతర దోపిడీలను పూర్తిగా నిరోధించవచ్చని, రాజకీయ సంస్కృతినే మార్చవచ్చని భీశెట్టి బాబ్జీ అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేత సతీష్ రావు, ఐఎన్‌టీయూసీ నేత రాజశేఖర్, జర్నలిస్టు సంఘాల నేతలు రామచంద్రరావు, శ్రీనుబాబు, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక వ్యవస్థాపకుడు శివశంకర్, జోగినాయుడు, ప్రొఫెసర్లు విజయకుమార్, తిమ్మారెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు. ◈

# ఉత్తరాంధ్ర ఏం కోరుతున్నది?

**- కొణతాల రామకృష్ణ,** మాజీ మంత్రి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో విస్తరించి, 23,537 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో (ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణంలో 15శాతం), దాదాపు ఒక కోటి జనాభాతో (ఆంధ్రప్రదేశ్ జనాభాలో 19శాతం) ఉత్తరాంధ్ర, పుష్కలమైన జల, ఖనిజ, అటవీ వనరులతో, మానవ వనరులతో అభివృద్ధి పథంలో అగ్రభాగాన ఉండవలసిన స్థితిలో ఉన్నప్పటికీ, పాలకుల నిర్లక్ష్యం వల్ల తనకు న్యాయంగా రావలసిన వాటా కూడా దక్కని దుస్థితిలో ఉంది. తమ వాటా తమకు దక్కలేదని గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రజలు ఉద్యమించినప్పుడు, ఆ సమస్య పరిష్కారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తరాంధ్ర ఎంతగా వెనుకబడి ఉన్నదో గణాంకాలతో సహా చూపింది. రాష్ట్ర విభజన జరిగే సందర్భంలో అవశేష ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని, ప్రత్యేక ప్యాకేజీలో నిర్దిష్ట కేటాయింపులు చేస్తామని కేంద్ర, రాష్ట్ర పాలకులు నమ్మబలికారు. మూడు సంవత్సరాలు గడిచిపోయినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం గురించి జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ వేసిన అంచనాలను మించిన మరింత దుర్భర స్థితి ఈ మూడు సంవత్సరాలలో ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం గురించి కూలంకషంగా చర్చించుకోవడం, ఉత్తరాంధ్ర ఏమి కోరుకుంటున్నదో ప్రజా ఆకాంక్షలన్నిటినీ సవివరంగా ముందుకు తేవడం, అన్ని వేదికల మీద, అన్ని రూపాలలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రజా ఆకాంక్షలకు సముచిత స్థానం ఇచ్చి, ఆ ఆకాంక్షలు నెరవేరే దిశగా అన్నిరకాల భావ ప్రచార, ఉద్యమ నిర్మాణ, సంఘీభావ సమీకరణ ప్రయత్నాలకూ పూనుకోవడం ఈ ప్రాంతపు రాజకీయ నాయకుల, విద్యావంతుల, యువజనుల, విద్యార్థుల, ప్రజలందరి బాధ్యత. ఈ బాధ్యత ఎంత బృహత్తరమైనదో గుర్తించడానికి ఈ ప్రాంత ప్రజాసమస్యలను, ఆకాంక్షలను సింహావలోకనం చేద్దాం.

విస్తారమైన సహజవనరుల, మౌలిక సౌకర్యాల లభ్యతలో ఉత్తరాంధ్ర ప్రపంచంలోనే అరుదైన ప్రాంతాలలో ఒకటి. నదులు, అడవులు, సముద్ర తీరం, ఖనిజ సంపద, జాతీయ రైలు, రహదారి మార్గాలు, ఓడరేవు, విమానాశ్రయం, అపారమైన మానవ శ్రమశక్తి, అన్నిటికన్ని వనరులూ పుష్కలంగా ఉన్న ప్రాంతం ఉత్తరాంధ్ర. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ప్రాంతాలను చూసినా ఈ వనరులన్నీ ఉన్న ఏకైక సంపన్న ప్రాంతం ఉత్తరాంధ్రే. కానీ ఈ వనరుల్లో ఏ ఒక్కటీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ఉత్తరాంధ్ర బిడ్డల మెరుగైన జీవనానికి సంపూర్ణంగా ఉపయోగపడడం లేదు. ఇక్కడి వనరులను ఉపయోగించి ఇక్కడి ప్రజల, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేసే రాజకీయ, ఆర్థిక, పాలనా విధానాలు లేవు. ఈ వనరులన్నీ బిడ్డకు దక్కని తల్లి స్తన్యంలా ఇతర ప్రాంతాలవారు కొల్లగొట్టుకు పోతుంటే అరికట్టే పాలక విధానాలు లేవు. కనుక 'మా వనరులను మా అభివృద్ధికే వెచ్చించాలి', 'మా వనరులు కొల్లగొట్టడానికి ఇతరులకు హక్కు లేదు' అని ఇవాళ ఉత్తరాంధ్ర ప్రజానీకం తమ ఆకాంక్షను ఎలుగెత్తవలసిన అవసరం వచ్చింది.




అన్నిటికన్నా ప్రధానమైన ఉత్తరాంధ్ర ఆకాంక్ష జల వనరుల గురించినది. బాహుదా, మహేంద్ర తనయ, వంశధార, నాగావళి, పెద్ద గెడ్డ, కందివలస గెడ్డ, చంపావతి, జంఝావతి, సీలేరు, శబరి, గోస్తని, నర్వ గెడ్డ, శారద, వరాహ, తాండవ వంటి జీవనదులకూ నిత్యం ప్రవహించే సెలయేళ్లకూ ఆలవాలమైన, రాష్ట్రం మొత్తంలోకి అత్యధిక వర్షపాతం నమోదయ్యే ఉత్తరాంధ్రలో వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యాలు కనీస స్థాయిలో కూడా లేవు. ఈ నదులలో సెలయేళ్లలో ప్రవహించే జలాలను సక్రమంగా వినియోగిస్తే ఉత్తరాంధ్రలో సాగుకు లాయకైన భూమి ప్రతి ఎకరానికీ నీటిపారుదల సౌకర్యం కలిగించవచ్చు. ఉత్తరాంధ్రను వ్యవసాయోత్పత్తులలో

## ప్రాంతీయ మండలి, పంచాయతీలు - మునిసిపల్ వార్డులకు తలసరి కేటాయింపు, నదుల అనుసంధానంతోనే ఉత్తరాంధ్ర వృద్ధి: జేపీ



ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర సహా నాలుగు ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయటంతోపాటు రాష్ట్ర బడ్జెట్‌లో 15శాతం నిధులను వాటికి కేటాయించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. ఉత్తరాంధ్రలో విశాఖ నగరాన్ని మినహాయిస్తే శిశు మరణాలు వెయ్యికి 55శాతం, అక్షరాస్యత 60శాతం, మహిళా అక్షరాస్యత 50.7శాతం, మంచినీటి సౌకర్యం లేని ఇళ్లు 86శాతం, మరుగుదొడ్డి లేని ఇళ్లు 79శాతం, తలసరి ఆదాయం రూ.38వేలుగా ఉంది. పలు ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకాశ్మీర్‌ల కంటే ఉత్తరాంధ్ర ఎంతో వెనకబడి ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నదుల అనుసంధానం కావాలి. ఇక్కడ పలు ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి. రాజకీయ సంకల్పం లేకపోవటం ప్రధాన కారణం. పోలవరం ఎడమ కాలువను శ్రీకాకుళం వరకు పొడిగించాలి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయాలి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి రూ.16,000 - 20,000 కోట్లు చాలు. ఏటా రూ.4వేల కోట్లు కేటాయించినా నాలుగైదేళ్లలో అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేయవచ్చు. ఉత్తరాంధ్ర ప్రాంతీయ మండలి ద్వారా తలసరి రూ.5,000 కేటాయించాలి, అందులో రూ.1000 ఒక్కో పౌరుని పేరు మీదా గ్రామపంచాయతీలు, మునిసిపల్ వార్డులకు కేటాయించాలి. వీటిని బాధ్యతగా వినియోగించేలా పర్యవేక్షించటం, తప్పు జరిగితే శిక్షించటానికే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం కావాలి. దీర్ఘకాలిక దృష్టితో ఈ సంస్థాగత మార్పులు చేస్తేనే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది.

('ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం - ప్రజల ఆకాంక్షలు'పై కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన సదస్సులో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్)

అన్నపూర్ణగా మార్చవచ్చు. దాదాపు యాభై ఎనిమిది లక్షల ఎకరాల ఉత్తరాంధ్ర విస్తీర్ణంలో ఇరవై నాలుగు లక్షల ఎకరాలు సాగుకు అనుకూలం కాగా, ప్రస్తుతం అందులో ఎనిమిది లక్షల ఎకరాలకు కూడా కాలువల కింద సాగునీటి పారుదల సౌకర్యం లేదు. ఎప్పటినుంచో ఉత్తరాంధ్ర ప్రజలకు పాలకులు ఆశ చూపుతున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను తక్షణమే ప్రారంభించి, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర ప్రజలు కోరుతున్నారు. ఉత్తరాంధ్రలోని పంట భూములన్నిటికీ సాగునీరు, అన్ని పట్టణాలకూ, గ్రామాలకూ తాగునీరు అందించడం తక్షణ కార్యక్రమంగా ప్రభుత్వం చేపట్టాలని ఉత్తరాంధ్ర ప్రజలు కోరుతున్నారు. సాగునీటికీ, తాగునీటికీ ఉద్దేశించిన పథకాలను పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎట్టి పరిస్థితిలోనూ మళ్లించగూడదని కూడా కోరుతున్నారు. ఉత్తరాంధ్రలో ప్రవహించే నదుల్లో ఎక్కువభాగం ఒరిస్సాలో పుట్టిన అంతర్రాష్ట్ర నదులు గనుక ఆ రాష్ట్రంతో చర్చలకు, సామరస్యపూర్వకమైన పరిష్కారానికి ప్రయత్నించి, ఉత్తరాంధ్ర ప్రజల హక్కులను పరిరక్షించాలి.

ఈ జలవనరుల సమన్యను సక్రమంగా పరిష్కరిస్తే ఉత్తరాంధ్రలో వ్యవసాయాభివృద్ధికి మార్గం సుగమమవుతుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దయెత్తున సాగుతున్న వలసలకు అడ్డుకట్ట పడుతుంది. పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఇక్కట్లు అనుభవిస్తున్న ఉత్తరాంధ్ర బిడ్డలు తమ గ్రామాలకు తిరిగి వచ్చి గౌరవప్రదమైన జీవనం గడపడానికి వీలు కలుగుతుంది. వ్యవసాయాభివృద్ధి పెరిగితే వ్యవసాయాధార పరిశ్రమల స్థాపనకు, ఉపాధికీ, ప్రాంత అభివృద్ధికీ కూడా అవకాశాలు మెరుగవుతాయి. వ్యవసాయాధార పరిశ్రమలు, ఆహార, పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమలు, జీడిపప్పు పరిశ్రమలు ఇతోధికంగా స్థాపించి, ఆ పరిశ్రమలలోను, అనుబంధ పరిశ్రమల లోను ఉపాధి కల్పించడానికీ, ప్రాంత ఆదాయం పెంచడానికీ ఎన్నో అవకాశాలున్నాయి. అటువంటి పరిశ్రమలకు ఉదాహరణప్రాయమైన పరిశ్రమలను, ప్రోత్సాహక కేంద్రాలను, నైపుణ్య బదిలీ కేంద్రాలను ప్రభుత్వమే స్థాపించి ఇటువంటి పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేయవచ్చు. అలాగే ఉత్తరాంధ్రలో ఉన్న అటవీ వనరులతో, ఖనిజ వనరులతో కాగితం, ఖనిజాధార తయారీ పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు, ఇటుకలు, పెంకులు, వస్త్ర పరిశ్రమలు వంటి ఎన్నో భారీ, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పరచడం ద్వారా, ప్రోత్సహించడం ద్వారా ప్రస్తుతం ఉత్తరాంధ్రలో నెలకొని ఉన్న తీవ్రమైన నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నించవచ్చు. విశాఖపట్నంలో రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడానికి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో సహా ఇతర సేవారంగ సంస్థలు నెలకొల్పడానికి ప్రభుత్వం ప్రయత్నించవచ్చు. ఇప్పటికి జరిగిన పారిశ్రామికాభివృద్ధిలో,

ఉద్యోగకల్పనలో ఉత్తరాంధ్ర స్థానిక ప్రజానీకానికి దక్కిన భాగమెంతో, ఉత్తరాంధ్ర స్థానికుల నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఏ చర్యలు తీసుకున్నారో అంచనా కట్టవలసే ఉంది. ఆ అసమానతలను తగ్గించడానికి కృషి చేయవలసే ఉంది.

ఉత్తరాంధ్రలో గణనీయమైన సంఖ్యలో ఆదివాసీ జనాభా ఉంది. మూడు జిల్లాలలోను ఆదివాసీ ప్రాంతాలున్నాయి. ఆదివాసుల అభివృద్ధి కోసం 2012లో విడుదల అయిన అరకు డిక్లరేషన్ ఆదివాసీ ప్రాంతాలలో అమలుచేయవలసిన అభివృద్ధి పథకాల గురించి, విధానాల గురించి వివరమైన సూచనలు చేసింది. ఆ సూచనలు ఇంతవరకూ అమలులోకి రాలేదు. ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక అస్తిత్వాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టడం, 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ అన్యాక్రాంతమైన ఆదివాసీ భూములను తిరిగి ఆదివాసీలకు అప్పగించడం, రాజ్యాంగం 73, 74 సవరణల ప్రకారం, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం ప్రకారం ఆదివాసీ ప్రాంతాల్లో పంచాయతీ పాలనను ప్రవేశపెట్టడం, గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం, బాక్సైట్ తవ్వకాలను ఆపివేయడం వంటి ఎన్నో డిమాండ్లను ఆదివాసులు ముందుకు తెస్తున్నారు. ఈ ఆదివాసీ ఆకాంక్షలన్నీ కూడా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలలో భాగమే. ఉత్తరాంధ్రలో మరొక పెద్ద ప్రజాసమూహం సముద్రం మీద ఆధారపడిన మత్స్యకారులు, ఇతర వర్గాలు. ఉత్తరాంధ్రకు ఉన్న 340 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని సముద్రం మీద ఆధారపడిన ప్రజల అభివృద్ధికి ఉపయోగించాలి. సముద్రతీరంపై మత్స్యకారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలి. ఫిష్ ప్రాసెసింగ్ పరిశ్రమలను, కోల్డ్ స్టోరేజీలను స్థాపించి మత్స్యకారులకు, ఇతర నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి.

కేవలం పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యారంగంలో ఉత్తరాంధ్ర బాగా వెనుకబడి ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాలలో అక్షరాస్యతలో విజయనగరం 13వ స్థానంలో, శ్రీకాకుళం 11వ స్థానంలో, విశాఖపట్నం 8వ స్థానంలో ఉన్నాయంటే ఈ మూడు జిల్లాల పట్ల పాలకుల నిర్లక్ష్యం అర్థమవుతుంది. పందొమ్మిదో శతాబ్ది చివరికే విద్యల నగరంగా ఉండిన విజయనగరం ఇరవయ్యొకటో శతాబ్దిలో అక్షరాస్యతలో చిట్టచివరికి చేరడం, దాన్ని సవరించడానికి పాలకులు ఎంతమాత్రం ప్రయత్నించకపోవడం, తగిన నిధులు కేటాయించి విద్యా సౌకర్యాలు కలిగించకపోవడం కొట్టచ్చినట్టు కనబడుతున్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యారంగంలోనూ, కళాశాల, విశ్వవిద్యాలయాల ఉన్నత విద్యారంగం లోనూ పాలకుల ఈ నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రాథమిక ఆరోగ్యం, పర్యాటక రంగం, విద్యుచ్ఛక్తి, రవాణా, ప్రభుత్వరంగ పరిశ్రమలు, వలసలు, పాలన, స్థానిక స్వపరిపాలనా సంస్థలు, పారిశుద్ధ్యం, పర్యావరణం వంటి ఏ రంగాన్ని తీసుకుని పరిశీలించినా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం స్పష్టంగా కనబడుతుంది.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో వెలుగులు నింపే, ఉత్తరాంధ్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలుకావాలంటే, ప్రభుత్వం వైపు నుంచి ప్రత్యేకించి అదే లక్ష్యంగా గల ఉత్తరాంధ్ర అభివృద్ధి మండలి ఏర్పాటు కావాలి. ఈ మండలిలో చిత్తశుద్ధి గల అధికారులను నియమించాలి. ఉత్తరాంధ్ర ప్రజల, రాజకీయ పక్షాల, ప్రజాసంఘాల ప్రతినిధులను ఈ మండలిలో భాగం చేయాలి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014, సెక్షన్ 46(3)లో నిర్దేశించినట్టుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలి. ఆ ఆర్థిక ప్యాకేజీ, ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌లో కనీసం 15శాతం (విస్తీర్ణాన్ని బట్టి) నుంచి 20శాతం (జనాభాను బట్టి) ఉండాలి. అంటే రూ.1.57లక్షల కోట్ల 2017-18 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రకారం ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ రూ.22,000 కోట్ల నుంచి 30,000 కోట్లు ఉండాలి. ప్రజల వైపు నుంచి ఉత్తరాంధ్ర ఆకాంక్షల గురించి నిరంతర చర్చ, పాలకుల దృష్టికి తీసుకుపోవడం, ప్రచారం, ఆందోళనా కార్యక్రమాలు కొనసాగాలి.

ఇవీ ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు: ఉత్తరాంధ్ర, రాయలసీమకు బుందేల్‌ఖండ్, బోలంగీర్ కలహండి - కోరాపుట్ తరహా ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి, ఉత్తరాంధ్రకు ప్రత్యేకంగా అభివృద్ధి మండలిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం పన్నుల రాయితీలతో కూడిన ప్రత్యేక హోదాను ప్రకటించాలి, ఉత్తరాంధ్రలోని 24 లక్షల ఎకరాలకు కనీసం ఒక పంటకైనా సాగునీరు సదుపాయం కల్పించాలి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలి, గోదావరి జలాల్లో ఉత్తరాంధ్రకు న్యాయమైన నీటి వాటాను కేటాయించాలి, గోదావరితో ఉత్తరాంధ్రలోని నదులను అనుసంధానం చేయాలి, విశాఖపట్నంలో రైల్వే జోన్‌ను వెంటనే ప్రకటించాలి, గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి, విమ్స్ ఆసుపత్రిని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలి, ఉత్తరాంధ్ర మరో భోపాల్ కాకుండా పర్యావరణాన్ని రక్షించాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ◈

# రిపబ్లిక్ ఎన్ మార్చ్ - లోక్‌సత్తా పార్టీ







ఉదారవాద విధానాలు, బహుళత్వ విలువలకు ప్రాధాన్యతనిచ్చే 39 ఏళ్ల ఇమ్మాన్యుయేల్ మేక్రాన్.. ఫ్రాన్స్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికై రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. దాదాపు 66శాతం ఓటర్లు ఆయనకు మొగ్గు చూపారు. పలు దేశాల్లోలా ఫ్రాన్స్‌లో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తీవ్రరూపం దాల్చటంతో.. ప్రజలలో తీవ్ర జాతీయవాదాన్ని, రక్షణాత్మక ధోరణుల్ని రెచ్చగొట్టి లబ్ధి పొందాలనుకునే విపరీత మితవాదులను ఎటువంటి వంశపారంపర్య రాజకీయాలు, ప్రత్యేకమైన ఓటు బ్యాంకు లేకుండా కేవలం ఆచరణాత్మక సానుకూల రాజకీయం, విధానాలతో మేక్రాన్ సమర్థవంతంగా ఎదుర్కొన్న తీరు పలువురిని ఆశ్చర్యపరిచింది. అయితే మేక్రాన్ వ్యక్తిగతంగా గెలిచినా, ఒక పార్టీగా అలా గెలవటం కష్టమని, ఆయన స్థాపించిన 'ద రిపబ్లిక్ ఎన్ మార్చ్/ రిపబ్లిక్ ఆన్ ద మూవ్' (ఎల్‌ఆర్‌ఈఎం) పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో గెలవలేదని పలువురు జోస్యం చెప్పారు. సొంత ఓటుబ్యాంకులు లేకపోవటం వల్ల ఓ కొత్త పార్టీ మెజారిటీకి తగినన్ని స్థానాలు గెలవలేదని, దీని వల్ల మేక్రాన్‌కు పాలనలో అడుగడుగునా సమస్యలు ఎదురయ్యే అవకాశముందని సహేతుకంగానే అంచనా వేశారు. కానీ, ఫ్రెంచి ప్రజలు ఆశించినదానికన్నా పరిణతిని ప్రదర్శించి మేక్రాన్‌కే కాకుండా (సగం సీట్లు మహిళలకే ఇచ్చిన) ఆయన 14నెలల పార్టీకి కూడా తాజాగా ఘనవిజయాన్ని అందించారు. మరోవైపు, మేక్రాన్ గెలుపు కేవలం ఫ్రెంచి పరిణామం కాదు! ప్రపంచ పరిణామంగా కంటే కూడా.. స్వదేశంలో రాజకీయ పరిణతికి దోహదం చేసే కీలకాంశంగా భారతీయులు మేక్రాన్, ఆయన పార్టీ గెలుపును గుర్తించాలి. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2009లో, 2014 ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాన్నే మేక్రాన్ అనుసరించారు. ప్రత్యేకంగా ఒక సెక్షన్ ఓటర్లంటూ లేకుండా మార్పు కోరుకుంటున్న వివిధ పాకెట్ల వారందరినీ, ముఖ్యంగా యువతను లోక్‌సత్తా ఓటర్లుగా మలిచేందుకు తెలుగు రాష్ట్రాల్లో జేపీ ప్రయత్నించారు. 2014లో దేశంలోనే అతి పెద్దదైన హైదరాబాద్ మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో పోటీని జేపీ ఎంచుకోవటానికి ఈ వ్యూహం కూడా ఓ ప్రధాన కారణం. సరైన దిశానిర్దేశం చేసే రాజ్యాంగం లేక 1789లో వచ్చిన ఫ్రెంచి విప్లవం విఫలమైనా, ఆ భావ పరంపర కొనసాగి స్పష్టమైన రాజకీయ మార్పులతో ప్రజల్లో వచ్చిన పరిణతి వల్ల ఫ్రాన్స్‌లో మేక్రాన్ ఎన్నిక కాగలిగారు .. ఆ స్థాయి రాజకీయ పరిణతి లోపించటం, పార్టీల అధికార లాలస, సీట్లు,




ఓట్ల కొనుగోలుకు విచ్చలవిడి డబ్బు పంపిణీ, ఆలోచనాపరులు - ప్రభావశీలుర మౌనం, పిరికితనం, దాటవేత వైఖరి, రాష్ట్ర విభజన నేపథ్యం వంటి పరిస్థితుల ప్రభావం వల్ల జేపీ మల్కాజిగిరిలో ఎన్నిక కాలేకపోయారు. ఇతర చోట్ల లోక్‌సత్తా నేతలు కొందరైనా గెలవలేక పోయారు. ఎల్‌ఆర్‌ఈఎంకి భిన్నంగా వ్యవస్థల నిర్మాణానికి వ్యక్తిగత ఆకర్షణను ఉపయోగించే పరిణతి విధానాలు, రాజకీయ సంస్కృతి లోక్‌సత్తా పార్టీకి ఉన్నా.. కనీసం ప్రభావం చూపగల 10-15శాతం ఓట్లు కూడా రాలేదు. లోక్‌సత్తా మూలంగా ఓడిపోయామని 2009 ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగుదేశం ప్రచారం చేసినా, జేపీ గెలిచిన కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మరింత విషప్రచారం చేసినా.. 'ఓటర్లు ఏ పార్టీ సొత్తుకాదు, తమకు ఎవరి విధానాలు మేలనుకుంటే ఆ పార్టీకే, అభ్యర్థులకే ఓటు వేస్తారు, అలా తాజా మెరుగైనవారికి వేస్తేనే అది ప్రజాస్వామ్యం' అనే లోక్‌సత్తా రాజకీయ సంస్కృతి, విధానానికే కట్టుబడి జేపీ మల్కాజిగిరిలో ప్రచారం చేశారు.. ఫ్రెంచి విప్లవం విఫలమై విప్లవ బిడ్డడినంటూ అధికారంలోకి వచ్చి నియంతగా మారిన నెపోలియన్ కంటే చిన్న వయసులో దేశాధ్యక్ష పదవిని చేపట్టిన ఘనత మేక్రాన్‌కి దక్కింది. ఒకప్పుడు ఉదారవాదం పేరు ఉచ్ఛరించటానికే ఇష్టపడని ఫ్రాన్స్‌లో.. ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమూల మధ్యేవాద ఉదార సంస్కృతికి తగిన పునాదిని నిర్మించటంలో మేక్రాన్ ఏ మేరకు సఫలమవుతారో వేచిచూడాల్సిందే. అధ్యక్ష ఎన్నికలలో ఆరు దశాబ్దాలలోనే ఘనమైన మెజారిటీని మేక్రాన్ సాధించినా.. ఓటింగ్ శాతం ఈ పార్లమెంటు ఎన్నికల్లో బాగా తగ్గి ఐదవ జాతీయ అసెంబ్లీ చరిత్రలోనే అత్యధికంగా 57.4 శాతం ఓటర్లు ఓటింగ్ పట్ల విముఖత వ్యక్తం చేశారనే హెచ్చరికను మర్చిపోకూడదు. విలక్షణ విజయంతో అధికారంలోకి వచ్చిన మేక్రాన్ పాలన ఫ్రాన్స్‌లోని ఓ తరాన్ని, తద్వారా ఐరోపా గమనాన్ని, అమెరికా పాత్రని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. స్వదేశంలో మార్పు తెచ్చుకోవాలనే సంకల్పం ఉంటే.. మనం ఆ పరిణామాలను కూడా జాగ్రత్తగా గమనిస్తూ నేర్చుకోవాల్సి ఉందని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ◈



## 'స్థానిక స్వయంపాలన, అధికార వికేంద్రీకరణ' పై న్యూఢిల్లీ సంస్కరణల శిక్షణా శిబిరంలో యూత్‌కి జేపీ దిశానిర్దేశం

అవగాహన, సాంకేతికతతో ఆధునిక ప్రజాస్వామ్య భారతదేశ నిర్మాణంలో భాగస్వాములమవుతామంటూ ముందుకొచ్చిన మెరికల్లాంటి విద్యార్థులు, యువతకు విజన్ ఇండియా ఫౌండేషన్ (వీఐఎఫ్) న్యూఢిల్లీలో నిర్వహించిన సంస్కరణల శిక్షణా శిబిరంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిశానిర్దేశం చేశారు. ఎన్‌సీఆర్ సోనెపట్ వద్దనున్న ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో...... 'స్థానిక స్వయంపాలనకు సాధికారత, అధికార వికేంద్రీకరణ'పై జేపీ కీలక ప్రసంగం చేశారు. చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజన్ ఇండియా ఫౌండేషన్‌ని ఐఐటీల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు ప్రారంభించారు. భారత్, అమెరికాల్లోని 40కి పైగా అత్యుత్తమ విద్యాసంస్థలు ఇందులో భాగమయ్యాయి. ఈ-గవర్నెన్స్, విద్య, గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలన వంటి వివిధ ప్రాజెక్టులపై పలు రాష్ట్రాల్లోవీఐఎఫ్ సభ్యులు కృషి చేశారు. ప్రభుత్వ ఉత్తమ నమూనా పథకాలను తెలియచేసేందుకు ఏటా ఎంపిక చేసిన 40మంది యువతను గుడ్ గవర్నెన్స్ యాత్ర పేరుతో దేశవ్యాప్త పర్యటనకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని కూడా ఫౌండేషన్ నిర్వహిస్తోంది. సామాజిక రాజకీయం పట్ల ఆసక్తి ఉన్న యువతకు ఇలా అధ్యయన అవకాశాల్ని కల్పించటంతోపాటు, వివిధ రూపాలలో ప్రోత్సహిస్తోంది. ఎంపిక చేసిన విద్యార్థులు, యువతీయువకులలో స్ఫూర్తిని నింపి వారికి దిశానిర్దేశం చేసేందుకు... దేశనిర్మాణంలో రోల్‌మోడల్స్‌లా పనిచేస్తున్న విధానరూపకర్తలతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తోంది.

Posting Date 07-07-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on July1st, 2017

# యజమానులైన ప్రజలముందు సేవకులైన పాలకులకు ఎటువంటి రహస్యాలు ఉండకూడదు




**అందుకోసం అరుణా రాయ్ వంటి వారితో కలసి లోక్ సత్తా 2005లో సమాచార హక్కు (RTI) చట్టాన్ని సాధించింది.**

**ఈ చట్టం లోని ప్రతి అక్షరాన్ని ఫుల్ స్టాప్ , కామా తో సహా హైదరాబాద్ లోక్ సత్తా కార్యాలయం లో నేను రాసాను . 2G స్కాం వంటి పెద్ద కుంభకోణాలు ఈ చట్టం వల్ల బయటకొచ్చాయి !**

# నిజాలు మాట్లాడుకుందాం-23

**షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి**

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad